ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
మార్చి 22, 2009
ఖరీదైన పెళ్లిళ్లు
మారుతున్న సాంప్రదాయాలు

హ్యాపీ బర్త్‌డే

(2009 మార్చి 22 నుంచి
2009 మార్చి 28 వరకు)

ఆర్. ఆర్యన్ కుమార్
4సం॥, మార్చి-24
వాణి-సురేష్‌కుమార్
రాజోలి-మ॥నగర్

వై. పల్లవి
7సం॥, మార్చి-2002
అరుణ-రమేష్
గాజువాక-విశాఖపట్నం

పి. ధీరజ్
2సం॥, మార్చి-2007
ఆశ-మహేష్
గన్నవరం-కృష్ణా

పి. ప్రతీక
6సం॥, మార్చి-2003
లావణ్య-శేకర్‌బాబు
మియాపూర్-హైదరాబాద్

వై. ప్రభుదీపిక
8సం॥, మార్చి-27
సుజాత-రత్నం
రామరాజుపల్లి-కడప

ఎస్‌కె. షాహీన్ అంజు
7సం॥, మార్చి-27
రజినిభి-రహీం
నేలకొండపల్లి-ఖమ్మం

ఐ. సౌగంధియశస్విని-స్మైలీ
మార్చి
జానకి-సైదులు
కనకగిరి సిరిపురం-ఖమ్మం

జి. అభిలాష్
2సం॥, మార్చి-22
రేణుక-నరేష్
ఆర్టీసీ క్రాస్‌రోడ్డు-హైదరాబాద్

జె. స్నేహిత
2సం॥, మార్చి-2007
శ్రీదేవి-బాలశంకర్
ఈపూరుపాలెం-ప్రకాశం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాద్-500 020

మనలో మాట

కూయవే ఓ కోయిలా...



ఉగాది దగ్గర పడుతుంటే ఉత్సాహంతో ఉరకలేస్తోంది కోయిలమ్మ. పాటలే లోకంగా పరవశిస్తోంది! ఆ ఆనందంతో ఉగాది సన్నాహాలు ఎలా ఉన్నాయో చూద్దామని బయల్దేరింది.

కొండాకోనా దాటింది. వాగూవంకా వెదికింది. చెట్టూపుట్టా చూసింది. ఊరూవాడా గాలించింది. ఎక్కడుంది సందడని వెతుకుతూనే సాగుతోంది!

ఓ చోట పసిపాప చిరునవ్వులా విరబూసి, వేపచెట్టు కనిపించింది. కోయిల ఆ చెట్టుపై వాలి కుహూ కుహూ అని పాడబోయింది. కాపలాదారు గద్దింపు వినిపించి, ఆగిపోయింది. వేపచెట్టుకు కూడా కాపలానా!? అని ఆశ్చర్యపోతుంటే- చెట్టుకు దిగేసిన ఇనుపరేకు కనిపించింది. దానిపై 'ఈ చెట్టుపై అమెరికాది పేటెంటు. ఆకు కోసినా, పువ్వు తెంపినా తప్పదు చీకటి కొట్టు.' అన్న హెచ్చరిక ఉంది.

నివ్వెరపోయిన కోయిల నింగిలోకి ఎగిరింది.

ఎంతసేపో ఎగిరెగిరి ఓ తోట గట్టున వాలింది.

అది నిండుగా పండిన చెరుకుతోట. తీపివాసన మనసును మధురం చేస్తుంటే... గొంతెత్తబోయింది. గట్టుపై విషాదం నింపుకున్న రైతు కనిపించాడు. 'తోట ఇలా తొణికిసలాడుతుంటే- నీ ముఖంలో విచారం ఎందుకన్నా?' అని అడిగింది. 'ఎందుకా? ఇది తీపి చెరుకు కాదు, చేదునిచ్చే సరుకు. ధర దక్కని పంట. మా జీవితాలకు మంట' అని చిరచిరలాడాడు రైతు.

అన్నదాతకు ఇంత ఆవేదనా? అని కలవరపడింది.

అక్కడ నిలవలేక ఎగిరిపోయింది.

ఓ వీధి చివరి పెరట్లో విరగగాచిన మామిడి కనిపించింది. అయితే, ఆ ఇంట్లోని పిల్లలు ఆ తియ్యని పుల్లని కాయలకోసం తహతహలాడడం లేదు. టెంకలేని మామిడిలో మజా ఆస్వాదిస్తున్నారు. చివుక్కుమంది మనసు. పాటను మరిచిపోయి, పైకెగిరింది.

కోనసీమ కొబ్బరి పంట కోటి తెగుళ్లతో కునారిల్లుతూ కనిపించింది. దిగుబడీ, ధరా లేక దిగులుగా ఉంది. కొండమీద 'ధర' లేదని చింతించిన చింతపండు- పట్టణం ప్యాకెట్లో సరికొత్తగా పలకరించింది. ఇప్పుడు రేటు ఎక్కువై సామాన్యుడికి భారమయ్యానని బాధపడింది! కోయిలమ్మ ఉత్సాహం నీరు కారిపోయింది. నీరసం ఆవరించింది. పచ్చడి దినుసులే ఇంత భారమైతే, పండగ ఇంకెంత భారమో? అనుకుంది.

ఇంతలో 'కుహూకుహూ'మని ఓ కమ్మని స్వరం వినిపించింది. ప్రాణం లేచొచ్చి, అటు చూసింది. అదో సెల్‌ఫోను కాలర్ ట్యూను! తన గొంతునిలా వెంటపెట్టుకున్నందుకు సంతోషించాలా? వసంతకోకిల కోసం ఎదురుచూసే జనం ఉండరని విచారించాలా?

'అద్వాన్సుడు హేపీ టెల్గు న్యూ ఇయర్, హేపీ ఉగాదీ...' ఫోన్లో తన మిత్రుడికి చెబుతున్నాడు సెల్‌వాలా!

'హతవిధీ... తెలుగు సంవత్సరాదికి ఏమి దుస్థితి ఇది?!' అనుకుంటూ కొండకోనలవైపు ఎగిరిపోయింది... పాపం... కోయిలమ్మ! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
రుచి	...	9
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
చూద్దామా	...	18
క్రైమ్ కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

తోలు బొమ్మలాట...4



కథ ...6

కథాత్మ



మంచి పుస్తకం ... 18

ఏడు తరాలు

ఆరోగ్యం ... 22

శుక్లం వస్తే



ఆకట్టుకున్న కవర్ స్టోరీ

మార్చి 8 ఆదివారం స్నేహ అట్టమీది కథలో తెలిపిన పసిడి గురించిన విషయాలు ఆకట్టుకున్నాయి. పుత్తడి అంటే మోజులేని వారు లేరంటే అతిశయోక్తికాదు. అయితే పుత్తడి కోసం రక్తం ఏరులై పారే విధానం, ప్రాణాలు గాలిలో కలిసిపోయేంత ప్రాధాన్యం దానికి ఇవ్వగూడదని నా ఉద్దేశ్యం. అట్టమీద బంగారు లోకం చూపినందుకు ధన్యవాదాలు. హ్యాపీ హోలీకి రంగుల బొమ్మలిస్తే బాగుండేది. బ్లాక్ అండ్ వైట్ బొమ్మలు పాఠకులకు బోర్ కొట్టించాయి. 10-4-09 న గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు గురించి ఇవ్వండి. 5-4-09న ఇస్తే బాగుంటుంది.

- బుర్రి కుమారరాజు,
రత్నపురి కాలనీ, గుంటూరు.

పుస్తక పరిచయం అవశ్యం

మార్చి 8 ఆదివారం స్నేహలోని మంచి పుస్తకం బాగుంది. భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్ర నాయకుడు, బహు విషయ గ్రంథకర్త సి.పి.ఐ(ఎమ్) మాజీ ప్రధాన కార్యదర్శి మరియు కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ ఇ.ఎమ్.ఎస్ నంబూద్రిపాద్ రచన, ఒక కమ్యూనిస్టు జ్ఞాపకాలు, పరిచయం ఉద్యమకారులకు ఎంతో అవసరం. దశాబ్దాల చరిత్ర పోరాటాలు ఈ పుస్తకం ద్వారా తెలుసుకోగలిగాం. ఇందులో కేవలం ఆయన వ్యక్తిగత స్మృతులు మాత్రమే కాదు, రాజకీయ చరిత్ర ఉంది.

- టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ఎండాకాలమ్ ఊసులు... వాహ్

మార్చి8 నాటి స్నేహ అట్టమీది కథ 'బంగారులోకం' మురిపింప జేసింది. ఆరోగ్యం శీర్షిక ద్వారా హెపటైటిస్ ఎందుకొస్తుందో అవగాహన కలిగింది. 'పొడవు× పొట్టి' చిత్రాలు గమ్మత్తుగా ఉన్నాయి. హ్యాపీ హోలీ సందర్భానుగుణంగా ఉంది. తెలుసుకుందామా ద్వారా చితోఢ్‌గఢ్ చరిత్ర క్లుప్తంగా తెలుసుకున్నాం. నరనరాల్లో వివక్ష కథ సామాజిక స్పృహతో కూడుకొని ఉంది. బాలనేస్తాలులో బీర్బల్ కథలు మాకు నచ్చుతున్నాయి. కొత్త పుస్తకాల శీర్షికలో పరిచయం చేసిన ఇండియా 2020 చాలా విలువైనదనిపిస్తోంది. తెలుగు తెర కథానాయికలను 'సినిమా కబుర్లు' ద్వారా మా జ్ఞాపకాల్లో కదలాడేలా చేశారు. మనలో మాట శెలవిచ్చిన ఎండాకాలం ఊసులు, బాసలు, రుసరుసలు వాహ్! ఏమున్నాయ్‌లెండి!!

- నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

నీ ఇల్లు బంగారం గానూ...

అప్పట్లో పద్దెనిమిది రూపాయలున్న పదిగ్రాముల బంగారం నేడు 14,000 అయింది. ఆడవారికి చీరలు, బంగారం... భర్త కంటే మిక్కిలి అభిమానపాత్రమైనవి. పురాణ దేవతలు వంటినిండా బంగారు ఆభరణాలు వేసుకొని సింగారించు కునేవారు. మహిళాలోకాన్ని అత్యంత ఆకర్షించే బంగారం పురుషుల చేతి వేళ్లకు చేరి కాంతులు చిందిస్తోంది. సినిమా కబుర్లు సినిమాలలో పాతతరం నుంచి నేటితరం వరకు హీరోయిన్ల పాత్రల్లో వస్తున్న ధోరణులను తెలిపారు. నాటి భానుమతి, సావిత్రి, వాణిశ్రీ, శారద, నిర్మల, మాలతి, జయసుధ వంటివారు మంచి నటీమణులు.

- వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

సినిమా కబుర్లు సూపర్

ఈవారం సినిమా కబుర్లలో తెలుగు తెరకు ప్రాణం పోసిన నాయికలు అంటూ ఆనాటి నుండి నేటి వరకు సినిమాల్లో కథానాయికా పాత్రల తీరు తెన్నులు, వారి ప్రాధాన్యతను చక్కగా వివరించారు. 'అంతరిక్షంలో ప్రమాదం' అని విజ్ఞాన వీచికలో మాకు తెలియని ఎన్నో విషయాలను చక్కగా తెలిపారు. అట్టమీది కథలో బంగారు లోకం అంటూ కొత్త లోకాన్నే చూపించారు. బంగారాన్ని ఈ విధంగా కూడా ఉపయోగిస్తారా? అని ఆశ్చర్యపోయాం. సామాన్యుడికి అందుబాటులో లేని వస్తువుగా తయారైన బంగారాన్ని తినటానికి, తాగటానికి ఉపయోగిస్తారంటే వింతగా ఉంది. ఈ పుత్తడి ధర ఇలాగే పెరుగుతూ పోతే ఇక మధ్యతరగతి ప్రజలకు నిజంగా బంగారాన్ని చూస్తే కొత్త లోకం చూసినట్టుగానే ఉంటుందేమో.

- రాగిణి, హుజూర్‌నగర్.

రంగుపడితే బాగుండేది

మార్చి 8, 09 స్నేహలో ప్రచురించిన కథ నరనరాల్లో వివక్ష చదివిన తర్వాత మనం ఎంత అభివృద్ధి సాధించినా ఇంకా కులం పట్ల వివక్ష పోలేదు. ఈ సమాజం మారదా అనిపిస్తుంది. హోలీ జాగ్రత్తలు బాగున్నాయి. ఫొటోలు

రంగుల్లో ఇస్తే ఇంకా బాగుండేది. మనలో మాటలోని ఎండాకాలం కబుర్లు బాగున్నాయి. నిజంగా ఈసారి కొంతమందికి ఇది గడ్డు కాలమే. రుచిలోని కూల్ డ్రింకులన్నీ కూల్ కూల్‌గా ఉన్నాయి. 'పొడవు× పొట్టి' చిత్రాలు చిత్రంగానే ఉన్నాయి. హెపటైటిస్ లో రకాలు, వాటి లక్షణాలు, ఈ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపినందుకు ధన్యవాదాలు.

- వనజ, కుమారి, రమాదేవి,
వెంకటేశ్వర్లు, గుంటూరు.

ఏం బంగారం బాబూ!

మనలో మాట బాగుంటోంది. బంగారులోకం లో బంగారం గురించి చాలా వివరాలు తెలియజేశారు. బంగారం ధరలు చూశాక గతంలో ఈ లోహంరేటు ఇంత తక్కువా అని ఆశ్చర్యపోయాం. తెలుసుకుందామా లో చితోఢ్‌గఢ్ కోట గురించీ, ఆనాటి రాజుల పరిస్థితుల గురించి తెలుసుకోవడానికి వీలు కలిగింది.

పి. పరమేశ్వరరావు,
ఐ. హేమంత్‌కుమార్, హైదరాబాద్.

త్వరలో...అతి త్వరలో...

సీరియల్ ప్రారంభం

పాఠకులకు ఓ శుభవార్త. అతి త్వరలో ఓ సీరియల్‌ను ప్రచురించబోతున్నాం. సుప్రసిద్ధ తమిళ అభ్యుదయ రచయిత కె. చిన్నప్ప భారతి కలం నుంచి జాలువారిన నవల 'గని'ని సీరియల్‌గా మీకు అందించనున్నామని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం. బొగ్గుగని కార్మికుల జీవితాలను స్పృశించే ఆ నవల మీ కుటుంబ సభ్యులందరిని తప్పకుండా ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం.

కథా నిలయం శ్రీకాకుళం

అగ్రవాద న్యాయం

- వల్లభాపురం జనార్థన



అశాంతి ప్రపంచ స్థాపనా చక్రవర్తిత్వమా!
అగ్రాసనం కోసం ఉగ్రవాద మందు పాతరను
పరిశోధిస్తున్న అగ్రస్వామ్య చక్రమా!
సామ్రాజ్యవాదమా!
అగ్రన్యాయపదకోశవిష్కరణ చేస్తున్న నైఘంటికా!
ద్రోణాచార్య పరంపరను కొనసాగిస్తూ...
గురుదక్షిణలు అందుకొంటున్న గురుపీఠమా!
నాలుకలేని ప్రపంచం
నీ నాలుక నేర్పించే మాటలే మాట్లాడాలని
వేదపనసలను వల్లెవేస్తున్న విద్యా పీఠమా!
వాడు మంచివాడు
వీడు చెడ్డవాడు
అతడు తుండగడు
ఇతడు ధర్మరాజు
అవినీతిమ్మరుసు ముద్రతోనే గుర్తించాలా?
నీ చెవినే తన చెవిగా
నీ కళ్లనే తన కళ్లుగా
నే చేతులనే తన చేతులుగా
నీ కాళ్ల నడకనే తన నడకగా తన ప్రపంచం
నడవాలా?
నియంతృత్వ ప్రజాస్వామ్యాన్ని
బ్రహ్మరథం పట్టమంటున్నావే
నీ తిండిపోతు తనాన్ని దాచుకోడానికి
వర్ధమాన ప్రపంచాన్ని తిండిపోతు
ప్రపంచమన్నావే.
నీ అడుగులకు మడుగులొత్తని దేశాలను
దారికి తెచ్చుకోవటం కోసం
కలుగుల్లోని పాములను నట్టిళ్లలోకి పంపించావు
కదా
నీవు పెంచి వదిలివేసిన పాము
నిన్నే కాటేయాలని చూస్తే
ఉగ్రవాది ముద్ర వేశావు కదా
అవును నిజమే
నీవి నల్ల కళ్లద్దాలతో చూస్తున్న కళ్లు కదా
అందుకే నల్లజాతి విముక్తికోసం
తెల్లతోలు అహంకారంపై పోరాడిన
నెల్సన్ మండేలా ఉండాల్సింది
ఉగ్రవాదుల జాబితాలోనే కదా
ఉండకపోతేనే ఆశ్చర్యపడాలి
అణుఒప్పందంపై సంతకం చేస్తుందనే
ఆశతో ఉన్నందుకేమో?
నీవు విడుదల చేసిన ఉగ్రవాదుల జాబితాలో
మా గాంధీపేరు చోటు
చేసుకోలేదు
పసిపాపకు చాక్లెట్లిచ్చి కిడ్నాప్ చేసే
నీ టెంపరి తనానికి జోహార్లు
నీ కాళ్ల తిమిరం వైపే
తేనెటీగల తుట్టెలను కదిలించటం వైపే
అందుకే జంకూ, గొంకూ లేకుండా
సిగ్గూ శరమూ లేకుండా
ప్రజాస్వామ్య వాదులను
ఉగ్రవాదుల జాబితాలో చేర్చావు
నీది రాక్షస బుద్ధి అంటే
ఆజాతి తనను పరువు తక్కువ వానితో
పోల్చావని తిట్టిపోస్తుంది.

కవిత్వమ్

ఓ ఉగాది వసంతమా....! వందనం!

- తంగిరాల చక్రవర్తి

తొలి ఉషస్సులో మెరిసే కిరణంలా
తొలకరి చినుకుల ఆశీ:పూర్వక
అక్షింతలు మాపై కురిపింప రావా ఓ ఉగాది
వసంతమా! ఓ ఉగాది॥

అష్టకష్టాల్ని ఆవలకు విసిరే
షడ్రుచులతో జీవన మార్గ నిర్దేశమా!
నీ నామం విరోధ మైనా! నీ మైత్రి మాకు
పంచరావమ్మా!

క్షుదార్తుల ఆక్రందనలు వినబడని
విశ్వంలా ఈ అవనిని
"అన్నపూర్ణ ఇంటిలా" చేయుమమ్మా! ఓ ఉగాది॥

మతం మత్తు గ్రోలే! అసురగణాల్ని
సురాసుర మనస్తత్వంతో మెసిలే నేతల్ని!
ప్రకృతితోనే వర్తకంచేసే పడమటి రాజ్యాధినేతల్ని
నిత్యం విరోధించి, నిరోధింపుము... ఓ ఉగాది
వసంతమా! ఓ ఉగాది॥

కోయిలమ్మ కొత్త రాగాలు
కొత్త సంవత్సర శకునం చెప్పే
శాస్త్రిగారి పంచాంగ శ్రవణాలు
ఎన్నో కలలుకనే ఎన్ని కల(ల) భారతిలో
సమాన్యుల స్వప్నాలు సాకారంచేయ రావమ్మా!
ఓ ఉగాది వసంతమా!!

★

తోలు బొమ్మలాట

జానపద కళారూపాల్లో ఒకటైన తోలు బొమ్మలాటకు వందల ఏళ్ల చరిత్ర ఉంది.

చైనా, గ్రీసు దేశాల్లో ఎప్పుడో క్రీస్తు పూర్వమే ఉన్న తోలుబొమ్మలాట తర్వాత్తర్వాత టర్కీ రష్యా తదితర దేశాలకు వ్యాపించినట్లు చెపుతారు. భారతదేశానికి చోళరాజుల కాలంలో మహారాష్ట్ర ప్రాంతం నుండి బళ్లారి, రాయదుర్గం ఆదోని వంటి ప్రాంతాలకు వలస వచ్చారని చరిత్రకారులు చెప్తున్నారు. అప్పుడే అనపర్తి చిన్ని కృష్ణ, తోట ఇంటిపేరు గలవారు అనంతపురం, తూర్పు గోదావరి జిల్లాలకు తరలి వచ్చి తోలుబొమ్మలాట కళాకారులుగా స్థిరపడ్డారని చెప్తారు.

ఈ తోలు బొమ్మలాట పుట్టుక ఎప్పుడు, ఏ ప్రాంతంలో జరిగినప్పటికీ భారతీయుల జీవితంలో ఒక భాగంగా మారిపోయింది. భారత గ్రామీణ ప్రాంతాల్లో నాలుగైదు దశాబ్దాల క్రితం వరకుకూడా తోలు బొమ్మలాట అంటే తెలియనివారు ఉండేవారు కాదు.

ఒక ఊరిలో తోలుబొమ్మలాట ప్రదర్శన ఇస్తున్నారంటే ఆ గ్రామంలోని చిన్నా, పెద్దా, ధనిక, పేదా తారతమ్యం లేకుండా చూసేవారు. ఇక బంగారక్క, కేతిగాడు వంటి పాత్రలు తెరపై కనిపించాయంటే చాలు ప్రేక్షకుల్లో ఉత్సాహం రెట్టింపయ్యేది. ఈ తోలు బొమ్మలాటకు రామాయణం, భారతం, భాగవతాల్లోని ఘట్టాలను కథావస్తువులుగా తీసుకునేవారు. వాటిలో ముఖ్యమైనవి లంకా దహనం, లక్ష్మణ మూర్ఛ, రావణ గర్వ భంగం, సుందరకాండ, అంగర రామాయణం, నర్తన శాల, ఉత్తర కళ్యాణం, శశిరేఖా పరిణయం, ఉత్తర గోగ్రహణం, దక్షిణ గోగ్రహణం, బాణాసుర, దేవాసుర, భానుమతి నీతి వంటి నాటకాలను ప్రదర్శించేవారు.

బొమ్మల తయారీ ఇలా...



తోలు బొమ్మలను ఆ నాటకాలు ప్రదర్శించే కళాకారులే స్వయంగా తయారు చేసేవారు. సాధారణంగా ఈ బొమ్మలను జింక, దుప్పి, మేక చర్మాలతో తయారు చేస్తారు. అయితే పాత్రల ప్రాధాన్యతను బట్టి జంతువుల చర్మాలను ఉపయోగిస్తారు. దేవతల పాత్రలైతే జింక చర్మాలను, దుప్పి చర్మాలను ఉపయోగిస్తారు. అదే రాక్షస పాత్రలు, దుష్టపాత్రలకైతే మేక చర్మాన్ని ఉపయోగిస్తారు. కొన్ని దేశాల్లో ఒంటె చర్మాన్ని కూడా ఈ బొమ్మల తయారీకి వాడతారు.

తోలు బొమ్మల తయారీ చాలా ఖర్చుతో, శ్రమతో కూడిన పని. ముందుగా పచ్చితోలును ఓ మాదిరిగా ఉన్న వేడినీటిలో నానబెడతారు. తర్వాత నున్నటి నేలపై ఈ చర్మాన్ని ఉంచి దానిపై ఉన్న వెంట్రుకలను తొలగిస్తారు. తర్వాత చర్మంపై ఉన్న పలుచటి పొరను తీసేస్తారు. ఇప్పుడు మరలా వేడినీటిలో ఉప్పును వేసి చర్మాన్ని శుభ్రం చేస్తారు. ఇలా శుభ్రం చేసిన చర్మాన్ని ఒక చెక్కపైన గట్టిగా లాగిపట్టి మేకులతో బిగించి ఆరబెడతారు. ఇలా అనేక దశలుగా శుభ్రం చేసిన చర్మం పారదర్శకంగా తయారవుతుంది. ఈదశలో చర్మంగుండా దీపపు కాంతి ఒక వైపు నుండి రెండవ వైపుకు ప్రసరిస్తుంది.

ఇలా తయారైన చర్మాన్ని ప్రదర్శనకారులు తాము ప్రదర్శించబోయే నాటకంలోని పాత్రల ఆకారంలో కత్తిరించి బొమ్మలను తయారు చేస్తారు. బొమ్మలకు తల- మొండెం ఒక భాగంగా, కాళ్లను రెండు భాగాలుగా, చేతిని మూడు భాగాలుగా అతికిస్తారు. ఈ విధంగా చేయడం వల్ల బొమ్మలను సులువుగా కదిలించడం వీలవుతుంది. ఈ బొమ్మలకు రంగులను కూడా ప్రకృతి సిద్ధంగా

లభించిన వాటినే ఉపయోగిస్తారు. అవి కరక్కాయ, చింతగింజల పొడి, అన్నభేది వంటి సామాగ్రిని ఉపయోగించి రంగులను తయారు చేస్తారు. ఈ విధంగా ఒక్కో పాత్ర బొమ్మను తయారు చేయడానికి కనీసం వెయ్యి రూపాయల వరకు ఖర్చు అవుతుంది.

ఇక ప్రదర్శన ఇవ్వాలంటే ఆ కథలోని పాత్రల సంఖ్యను బట్టి స్త్రీ, పురుషులు కలిపి ఓ పదిమందైనా అవసరమౌతారు. వీరు కాక మృదంగం, తబలా, హార్మోనియం వంటి వాయిద్యాలు, మైకులు, చెక్కబల్లలు, విద్యుత్ దీపాలు వంటి ఇతరత్రా సామాగ్రిని తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది.

కొయ్య బొమ్మలాట, తోలు బొమ్మలాట, ఊచ బొమ్మలాట వంటి ఎన్నో జానపద కళలు ఆధునిక కాలంలో అంతరించి పోతున్నాయి. నేటి తరానికి అసలు అవంటే ఏంటో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. సినిమాలు వచ్చేప్పటికి జానపద కళలు నిరాదరణకు గురయ్యాయి. ఇక టీవీలు, కేబుల్ కనెక్షన్ల రాకతో మారుమూల ఉన్న పల్లెప్రాంతాల్లో కూడా నేటి రోజుల్లో ఈ జానపద కళలు కనిపించకుండా అంతర్ధానమయ్యాయి.

పూర్వం పండుగలకు, పబ్బాలకు, జాతర్లకు, సంబరాలకు తోలుబొమ్మలాటలను ఏర్పాటు చేసేవారు. కొన్ని ప్రాంతాల్లోనైతే వర్షాలు కురవకపోతే తోలు బొమ్మలాట ప్రదర్శనకారులను పిలిపించి విరాట పర్వం ప్రదర్శిస్తే వర్షాలు పడతాయనే నమ్మకం కూడా ఉంది. ప్రస్తుతం పట్టణాలలోనే కాదు గ్రామ ప్రాంతాల్లో కూడా వీటిని మర్చిపోయే పరిస్థితి ఉంది. వీటినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారుల కుటుంబాలు నేడు అత్యంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మన రాష్ట్రంలోని అనంతపురం, ఉభయ గోదావరి ప్రాంతాల్లో అనేక తోలు బొమ్మలాట ప్రదర్శనలిచ్చే కుటుంబాలు ఉపాధి లేక ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలంలోని మాధవపట్నం లోనే సుమారు 600 పైగా కళాకారులు ఉన్నారు. వీరిలో కొందరు ఇప్పుడు గొడుగులు బాగుచేసే పని, ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకోవడం, ప్లాట్‌ఫారం మీద పాత దుస్తులను విక్రయిస్తూ అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు. బతుకు బండిని నడపడానికి ఏ వృత్తినైనా ఆశ్రయిస్తున్నారు. అయినా కానీ వీరు ఆ కళలపై మమకారాన్ని వదులుకోలేకపోతున్నారు. వృద్ధ కళాకారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వారు ఏ పనీ చేయలేక, వారిలో కొందరు భిక్షాటననే వృత్తిగా ఎంచుకున్నవారు కూడా లేకపోలేదు. అడపా దడపా ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం వీరిని వినియోగించుకుంటూ తృణమో ఫణమో ఇస్తున్నా అందువల్ల వారికి జరిగే ప్రయోజనమేమీ లేదు. ఆసువుగా కథలను, గాథలను చెప్పగలిగే వీరిలో పెద్దగా చదువుకున్నవారు కూడాలేరు.

ఆధునిక సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రాచీన కళారూపాన్ని తీర్చిదిద్ది, ఆయా కళాకారులకు చేయూతను అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

★



కథ

కథాత్మ

- పీపీ

> **అప్పటికే డాక్టర్ రావడంతో డిశ్చార్జి బిల్లు పూర్తయింది. కట్టేసి బయటపడ్డాను.నాన్న కోసం ఆటో మాట్లాడాను. అయితే ఆయనతో నేను ఇంటిదాక వెళ్లే పరిస్థితి లేదు. అర్జెంటు పని చూసుకోవాలి. డిశ్చార్జి అయిన నాన్నను వెంట వుండి తీసుకెళ్లడం పద్ధతి. కాని అలా చేస్తే పని దెబ్బ తింటుంది. అయిష్టంగానే ఆయనను పంపించి నేను నా పనిమీద బయలు దేరాను. ఆ పనిచూసుకుని తిరిగి వస్తూ కాఫీ తాగుదామని అక్కడ ఒక చిన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లాను.అక్కడ ఏం చూశానంటే- వేణుగోపాల్ ఆగాడు. వెన్నెల తెచ్చిన మంచినీళ్లు తాగి మళ్లీ మొదలెట్టాడు.**

'ఈ మధ్య ఏం రాయలేదన్న మాట' చాలా మందితో చాలా సార్లు అన్న మాటే మరోసారి అన్నాడు వేణు గోపాల్.

'ఎక్కడండీ కుదరడం లేదు' సంజాయిషీగా చెప్పాడు సారథి. అలా అంటూనే పక్కనున్న వెన్నెల కేసి చూశాడు. ఆమె స్పందించేలోగానే

వేణు గోపాల్ ఎప్పటి లానే తన తర్వాతి మాటన్నాడు–

'కుదరదంటే కుదరదు. కుదురుతుందంటే కుదురుతుంది'

మీకేం అలాగే అంటారు. మీకంటే ఏ బాధ్యతలూ వుండవు.ఇంట్లో పని మొత్తం ఆవిడ చూసుకుంటారు. మాకు చిన్న పిల్లలు, ఇంటి పనులు..'

'అవన్నీ వెన్నెల చూసుకుంటుందిగా.. '

'అంటే మేము రాయనవసరం లేదని మీ ఉద్దేశమా?' వెన్నెల తగాదాకొచ్చింది.

'ఎంత మాత్రం కాదు గాక కాదు. తన సంగతి తేల్చాక నిన్నూ అదే అడగాలనుకుంటున్నా.చెప్పు బోలెడు సాహిత్యాసక్తి,సామాజిక స్పృహ గట్రా ఎక్స్‌ట్రా వున్నదానివి నీవూ రాయడం లేదు?'

'అడిగితే చెబుదామని నేనూ చూస్తున్నా. అహోరాత్రులు ఇంటెడు చాకిరీ మాపైన వేసింది గాక రాయండి,పాడండి, పని చేయండి అని ఉచిత సలహాలు ఇచ్చేస్తే సరిపోతుందా?' వెన్నెల తగాదాకొచ్చింది.

'అబ్బో నీ ధోరణి చూస్తుంటే బాగా గొడవ పడాలని డిసైడైనట్టున్నావే. నాకంత ఓపిక లేదు గాని మీ సమస్యలు ఒప్పేసుకుంటున్నా. ఎంత చెప్పినా ఇంట్లో వాళ్ల సహకారం లేకుండా ఆడాళ్లు రాయడం చదవడం పెద్ద సమస్యే.'

'అంటే మేము సహకరించడం లేదనా?' ఇప్పుడు సారథి రోషానికొచ్చాడు.

'నీ సంగతి నాకు తెలియదు గాని నేనైతే ఏ పని చేయను. పైగా మన లోకజ్ఞానమంతా వాళ్లపైన రుద్దుతూ ప్రతి దాన్ని విమర్శిస్తూ ప్రతి పనిలో తప్పు పడుతూ అన్నింటిలో వేలు పెడుతూ...' వేణు గోపాల్ మాటలు ముగియకముందే అందుకున్నాడు సారథి

'ఏంటి సార్, మొత్తం ప్లేటు ఫిరాయించేశారు... అదంతా సరేగాని ఏదైనా రాద్దామనుకున్నా మంచి పాయింటు దొరకడం లేదు సార్....' అసలు సంగతి బయిటపెట్టాడు.

'అది మాత్రం నిజమే మాష్టారూ,, మా పనుల గొడవ ఎలాగూ వుండేదే గాని మీ అనుభవంలో రచనలకు ఏవైనా చిట్కాలుంటే చెప్పండి...

చిట్కాలు చెప్పలేను గాని చిట్కాలే వుండవని చెప్పగలను' తమాషాగా అన్నాడు వేణు గోపాల్.

దంపతులిద్దరూ ప్రశ్నార్థకంగా చూశారు.

'ఇంక డొంక తిరుగుడు వద్దు గాని సూటిగా చెప్పండి సార్' వెన్నెల వేడుకోలుగా అంది.

'ఏం లేదు తల్లీ, జీవితాన్ని జాగ్రత్తగా గమనిస్తే రాసుకోవలసిన బోలెడు అంశాలు కనిపిస్తాయని చెబుతున్నానంతే.'

'అంత గొప్పవి ఏముంటాయి సార్!' సారథి అవిశ్వాసం ప్రకటించేశాడు.

'సరే విక్రమార్కుని కథలో బేతాళుడిలా మీకు కొన్ని ఘటనలు చెబుతాను.విన్నాక నా మాటలు నిజమో కాదో చెప్పండి..' అన్నాడు వేణు.

"పైగా ఇవన్నీ ఒక్క రోజులో జరిగినవే. అదీ మొన్న మా నాన్నగారికి ఆరోగ్యం బాలేదని వెళ్లొచ్చానే..అప్పుడన్నమాట..."

అతనా మాట అన్నాక వాళ్లిద్దరూ మరింత ఆసక్తిగా చూస్తుండగా వేణు గోపాల్ తన కథనం మొదలెట్టాడు.

¤ ¤ ¤

నాన్నను డిశ్చార్చి అనుకున్నదానికంటే ఒక పూట ఆలస్యం చేశాడు డాక్టర్ గారు. దాంతో నేను ఒక పగలు అదనంగా వుండాల్సి వచ్చింది. అంతకు ముందు రోజు వరకూ గదిలో పక్కన బెడ్ ఖాళీగా వుంది.ఆ రోజు ఉదయమే దానికి సంబంధించిన పేషంట్ పై నుంచి మళ్లీ వచ్చాడు. చూస్తే చాలా ఎత్తుగా గంభీరంగా వున్నాడు. అతను వచ్చి బెడ్ మీద నాకు వీపు చేసి కూచున్నాడు. ఎంత నిటారుగా నిబ్బరంగా వున్నాడు అనుకున్నాను లోలోపల. తర్వాత అతని గురించి తెలిసింది. అంతకు ముందు వరకూ అతని కొడుకులు మాత్రమే అక్కడ వుండి మాతో మాట్లాడుతుండేవారు. వాళ్ల కుటుంబం మా స్వంత వూరి వాళ్ల తాలూకేనని తెలిసిన తర్వాత ఇంకా ఆప్యాయంగా మాట్టాడ్డం మెదలెట్టారు.

మా నాన్న వాళ్ల నాన్న కన్నా వయసులో చాలా పెద్దవాడైనా బలహీనంగా వున్నా ధైర్యంగా వున్నాడని మెచ్చుకున్నారు. పైగా తమ తండ్రి చెప్పలేనంత భయస్తుడని, రక్తం చూస్తే కళ్లు తిరిగిపడిపోతాడని కూడా చెప్పారు. ఆపరేషన్‌కు, పరీక్షలకు అతను భయపడుతున్నందువల్లనే కేసు వాయిదా పడుతూ

వస్తుందన్నారు. మేడిపండు చూడ మేలిమై వుండు అన్న వేమన పద్యంలో మేకపోతు గాంభీర్యం అంటే ఏమిటో అప్పుడు చాలా బాగా అర్థమైంది. తర్వాత ఆయనతో చాలా సేపు మాట్లాడుతూనే వున్నాము. ఇతరత్రా లోకజ్ఞానం, పరిణతి అన్నీ బాగానే వున్నాయి. కాని మనిషి మాత్రం నిజంగానే చెప్పలేనంత పిరికి. వాళ్లతో మాట్లాడుతుంటే పల్లెలు, అక్కడ మానవసంబంధాలు, ఇంకా ఏమేమో సోదాహరణంగా తెలిసి వచ్చాయి...

అవేమిటో చెప్పలేదే?

"అవన్నీ లోతుగా తడమాలంటే చాల సమయం పడుతుంది. ఆ రోజు కథలు ఇంకొన్ని చెప్పాలి కదా.." అంటూ కొనసాగించాడు వేణు గోపాల్.

'అంతేనా.. సామాన్యంగా సాధారణంగా కనిపించే సంఘటనల వెనకనే అగాధమైన జీవిత సత్యాలుంటాయి. సాహిత్య సందేశాలుంటాయి. ఇందులో ప్రతి ఉదంతంలోనూ జీవితం తాలూకూ భిన్న పార్శ్వాలు, బహు వ్యక్తిత్వాలు వైరుధ్యాలు మీకు కనిపించ లేదా? వేణు గోపాల్ అడిగాడు.అయిదు నిముషాలు ఆలోచించి చెప్పండి. ఈలోగా నేను మొహం కడుక్కొస్తాను'

¤ ¤ ¤

నాన్నను ఈ పూటైనా డిశ్చార్చి చేయడం పూర్తయితే నేను హైదరాబాదు బయిలు దేరొచ్చనేది నా తొందర. కాని డాక్టర్ గారు పూర్తిగా కేసును పరిశీలించి అబ్జర్వేషన్స్ రాస్తే గాని అది సాధ్యం కాదు.ఆయనేమో ఆస్పత్రిలో లేదు. ఏం చేద్దాం అనుకుంటూ అక్కడే వెయిట్ చేస్తున్నాను. మీకు తెలుసు కదా.. నేను వెయిటింగ్‌ను బాగా ఎంజాయ్ చేస్తానే గాని విసుక్కోను. ఆ సమయం నా ఆలోచనలు వూహలు మల్చుకోవడానికి వినియోగిస్తాను.

అలా డాక్టర్ కోసం కూచుని అన్నీ నెమరేసుకుంటుంటే నా ముందు సీటులో ముసలాయన పక్కనున్న అమ్మాయితో అవీ ఇవీ మాట్లాడ్డం మొదలెట్టాడు. కబుర్ల తాతయ్యలా వున్నాడే అనుకుని నవ్వుకున్నాను. ఆ అమ్మాయి వాళ్లమ్మను చూపించడం కోసం వచ్చిందట. తాత వదలకుండా వసపిట్టలా మాట్లాడుతుంటే భరించలేక(బేర్ చేయలేక) అక్కడ నుంచి లేచి నేనున్న వరసలో కూచుంది. జరిగింది గమనించాను గనక నేను నవ్వితే తనూ నవ్వింది.ఇంతలో తాత ఆ అమ్మాయి స్థానంలో వచ్చికూచున్న యువకుణ్ని మాట్లాడించడం మొదలెట్టాడు. అతను నిరాసక్తంగా జవాబులిచ్చాడు. కాని తాత వదలడు గదా,, కొంచెం సేపటి తర్వాత కులం ప్రస్తావనలు తెచ్చి వ్యాఖ్యానాలు చేశాడు.ఇప్పుడా అబ్బాయి కొంచెం ఆగ్రహం మరికొంచెం అభ్యంతరం ప్రకటించడంతో వెనక్కుతగ్గాడు. అప్పుడే నన్ను చూసి గుర్తు పట్టాడు.మీరు ఫలానా విశ్లేషకుడు కదా అని మాట కలిపాడు. మామూలుగా చూపేంత స్పందన ఆయనకు చూపలేదు.ఎందుకంటే తన తంతు చూస్తూనే వున్నాను ....

ఈ లోగా ఆస్పత్రి బయిటనుంచి బిగ్గరగా కేకలు వినిపించాయి.ఏదోలే పట్టించుకోవడం ఎందుకు అని అలానే వుండిపోయాను. కాస్సేపటికి ఆ కేకలు పెద్దవయ్యాయి. ఇక తప్పదని లేచి వెళితే. పక్కనున్న రాజీవ్ గృహకల్పలో గొడవ. ఎవరో కొట్టుకుంటున్నారు. నిజానికి ఇద్దరు కుర్రాళ్లను కొడుతున్నారు. వాళ్లు పెద్దగా ప్రతిఘటించడం లేదు. కాస్సేపటికే విషయం అర్థమైపోయింది. అక్కడ ఆడాళ్లు స్నానం చేస్తుంటే ఈ అబ్బాయిలు తొంగి చూశారట. దాంతో వాళ్లు కుర్రాళ్లు కోపంతో దేహశుద్ధి చేస్తున్నారు.వీరు ఏదో అంటున్నారు గాని దొరికి పోయిన దొంగల్లా ఆ మాటల్లో తూకం లేదు. వెనకనుంచున్న పేదింటి ఆడవాళ్లు అక్కడ చేరిన వాళ్లతో బాధను వెళ్లబోసుకుంటున్నారు. కొట్టే వాళ్ల కోపం ఆగడం లేదు. ఆ గొడవ పెద్దదై పోతుందేమోనని మళ్లీ ఆ ఆడాళ్లే భయపడుతున్నారు.

ఆస్పత్రి ఆవరణలోంచి ఇదంతా చూస్తున్నామా.. ఇక్కడ కూడా తలో మాట అంటున్నారు. అయితే ఇదంతా లేనిపోని తగాదా అన్నట్టు వుంది వీళ్ల ధోరణి. ఇంతలో దెబ్బలు తింటున్న వారిని ఆడవాళ్లు విడిపించడంతో ఒక్కసారిగా తమ మోటార్ సైకిల్ దగ్గరకి పరుగు పెట్టి వెనక్కు తిరిగి చూడకుండా పరిగెత్తిపోయారు. వాళ్లు అలా పోయిన తర్వాత అక్కడ వదలి వెళ్లిన హెల్మెట్ కనిపించింది. వాళ్లను కొట్టిన కుర్రాళ్లలో ఒకడు దాన్ని చూసి కోపంగా శక్తి కొద్ది విసిరి పగలగొట్టాడు. ఆ విసురులో దాని తాలూకూ ముక్క ఒకటి మా వైపు వచ్చింది. ఇంకేముంది?ఇక్కడ గుంపులో ఒక పెద్ద మనిషి సందర్భాన్ని కూడా పట్టించుకోకుండా భగ్గుమని లేచాడు. అతనికి నచ్చచెప్పడానికి చాలా శ్రమ పడాల్సి వచ్చింది. అలాంటి సమయంలోనే కుయ్ మని చప్పుడు చేసుకుంటూ పోలీసు జీపు వచ్చి ఆగింది. అప్పటికే అంతా సద్దు మణిగి వుంది. వాళ్లు ఎలాంటి ఆందోళన లేకుండా తాపీగా ప్రశ్నలు వేసి అందరినీ అదమాయించి పోయారు.

అప్పటికే డాక్టర్ రావడంతో డిశ్చార్జి బిల్లు పూర్తయింది. కట్టేసి బయటపడ్డాను.నాన్న కోసం ఆటో మాట్లాడాను. అయితే ఆయనతో నేను ఇంటిదాక వెళ్లే పరిస్థితి లేదు. అర్జెంటు పని చూసుకోవాలి. డిశ్చార్జి అయిన నాన్నను వెంట వుండి తీసుకెళ్లడం పద్ధతి. కాని అలా చేస్తే పని దెబ్బ తింటుంది. అయిష్టంగానే ఆయనను పంపించి నేను నా పనిమీద బయలు దేరాను. ఆ పనిచూసుకుని తిరిగి వస్తూ కాఫీ తాగుదామని అక్కడ ఒక చిన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లాను.అక్కడ ఏం చూశానంటే - వేణుగోపాల్ ఆగాడు. వెన్నెల తెచ్చిన మంచినీళ్లు తాగి మళ్లీ మొదలెట్టాడు.

¤ ¤ ¤

నేను వెళ్లిన కాఫీ సెంటర్ దాదాపు ఖాళీగా వుంది. అలాంటి చోట శుభ్రత తక్కువగా వుండొచ్చనిపిస్తున్నా దగ్గరలో వుంది గనక వెళ్లాల్సి వచ్చింది. కౌంటర్‌లో భర్త కూచుని టోకెన్లిస్తుంటే భార్య లోపల పనులు చూస్తున్నది. దాదాపు ప్రతి చోటా ఇలాంటి పని విభజనే కనిపిస్తుంటుంది. కొన్ని చోట్ల భర్త కిచెన్ చూస్తుంటే భార్య కాష్ చూస్తుంటుంది. నేను టోకెన్ తీసుకుని టీ కాఫీ కప్పుతో సహా వచ్చి టేబుల్ దగ్గర నిలబడి తాగడం మొదలెట్టాను.

ఇంతలో ఒకావిడ హోటల్ లోకి వచ్చింది. ఆమె తప్ప నేనున్నంత సేపు మరెవరూ రాలేదు. అయితే ఆమె నేరుగా రాలేదు. వస్తూ వస్తూ ఏవో ఏరుకుంటూ వస్తున్నది. రాగానే ఓనర్ కేకలు వేయడం మొదలు పెట్టాడు. ఏమంటే ఆమె రోడ్డుపైన పడిన పాల కవర్ల వంటివి ఏరుకు వచ్చి ఓ మూలన పెడుతుంది. వెళ్లేప్పుడు తనతో తీసుకుపోతుంది. 'ఇదంతా కుదరదని నీకు మొదటే చెప్పాను.అయినా అట్లనే చేస్తున్నావ్. వూరికే మానేసెయ్. అంటూ గయ్‌మన్నాడు ఓనరు. ఆమె ఏమీ పట్టించుకోకుండా నిర్వికారంగా కిచెన్‌లోకి నడిచింది.నేను ఈ మొత్తం విషయాన్ని కాస్సేపు ఆలోచించుకుని బయటకు నడిచాను.

¤ ¤ ¤

ఇంటికి వెళ్లే సరికి నాన్న హాయిగా శయనించి వున్నాడు. ఆటోలో ఆయన ఇంటికి చేరేసరికే ఎ వరో తెలిసిన వాళ్లు వచ్చి వున్నారట. వాళ్ల సహాయంతో ఆయన సులభంగా దిగిపోయాడు. నేను వెంటనే బయలు దేరతానంటే అమ్మ తిని వెళ్లమని బలవంతం చేసింది. మాట కాదనలేక అంగీకరించాను. తిండి పూర్తిచేసి కునుకు తీసి బస్టాండుకు చేరుకున్నాను.బస్సు కూడా తేలిగ్గానే దొరికింది.

హైదరాబాద్ కేనా- వెన్నెల అడిగింది.

ఆ మరెక్కడికనుకున్నావ్... ఇక నా సశేష కథకు కేంద్రం బస్సు ప్రయాణమే. అంటూ వేణు గోపాల్ మళ్లీ అందుకున్నాడు.

¤ ¤ ¤

బస్సు పెద్ద రద్దీగా కనిపించలేదు. కాని లోపలికి వెళ్లినకొద్దీ చాలా సీట్లలో ఏదో ఒక రిజర్వేషన్ గుర్తు వుంది. మళ్లీ ప్రతివారినీ పక్కన వున్నారా అని అడగడం.. అందరూ వున్నారనే అంటారు. అంతమంది వుండరని తెలిసినా తగాదా పెట్టుకోలేని పరిస్థితి. బస్సు మధ్యలో ఒక కుర్రాడు ఒక్కడే కూచుని వున్నాడు.పక్కన అనధికార రిజర్వేషన్ కర్చీఫ్ వుంది. ఎవరో వస్తారని అన్నాడు అతను నేను వాకబు చేస్తే. నేను పెద్దగా నమ్మలేదు గాని ఎందుకొచ్చిన తగాదా అని ముందుకొచ్చికూచున్నాను. తమాషాగా బస్సు కాస్తయినా కదిలిందో లేదో ముందు లేడీస్ సీట్లలో నుంచి ఒకమ్మాయి హడావుడిగా లేచి వెనక్కు వచ్చి అతని పక్కన కూచుంది. తన కోసం వచ్చిన వాళ్లు వెళ్లిపోయారా లేదా అని పరిశీలించి తెలుసుకున్నది.

'తర్వాత-' సారథి అడిగాడు.

ఏముంది వాళ్లిద్దరూ మాటల్లో పడిపోయారు. చాలా ఆనందంగా కనిపించారు. ఈ విషయంలో చాలా రకాలైన అవకాశాల గురించి ఆలోచించాను గాని వారి గురించి ఎలాంటి వూహాగానాలు చేయదల్చలేదు. కాస్సేపటి తర్వాత లేచి వెనక్కు వెళ్లాను. దానికి సమాంతరంగా వుండే పక్క వరసలో కూచుని వున్నాడు నేను ఇప్పుడు చెప్పబోయే హీరో.వేణుగోపాల్ అన్నాడు.

ఎవరా హీరో ఏమా కథ? వెన్నెల తమాషాగా అడిగేసరికి ఒకింత నవ్వుతూ తర్వాత భాగం కొనసాగించాడు.

⌑ ⌑ ⌑

నేను కూచున్న సీటుకు సమాంతరంగా అవతల కిటికి పక్క సీటులో కూచున్నాడతను.శరీర కష్టం చేసే మనిషిలా వున్నాడు.బస్సు కదిలిన కాస్సేపటికి తన జేబులోంచి సెల్ ఫోన్ తీసి మాట్లాడ్డం మొదలెట్టాడు.దాదాపు ఇరవై నిముషాలు మాట్లాడాడు.తనే లేనిపోని సంగతులు చెప్పాడు.వాటిపై మళ్లీ వివరణలు ఇచ్చాడు. అప్పులు, ఆదాయాలు వంటివి జాగ్రత్తగా మాట్లాడుతున్నాడు గాని సంభాషణను ఆపడం లేదు. ఏదో విధంగా సెల్లు లో ఎక్కువ సేపు ఎక్కువ మందితో మాట్లాడాలనుకుంటున్నట్టు వున్నాడు. అలా దాదాపు అరడజను మందితో అనవసరమైన విషయాలే ఎక్కువగా మాట్లాడటం నేను గమనిస్తూనే వున్నాను. అసలు అతను మాట్లాడ్డమే చాలా బిగ్గరగా వినిపిస్తున్నది. వస్తు సంస్కృతి, సెల్లు ఫోను కాదు సొల్లు ఫోను వంటి మాటలు నాకు గుర్తుకు వచ్చాయి. ఆ పైన దాని తాలూకూ మంచి చెడ్డల మీమాంస కవితా చరణాలు కాస్సేపు గుర్తు చేసుకున్నాను. ఇంతలోనే ఆశ్చర్యకరంగా అతను మరో జేబులోంచి ఇంకో ఫోను తీసేసరికి దిమ్మెరపోక తప్పలేదు. దాంట్లో బ్యాటరీ,సిమ్ కార్డు దీంట్లోకి మార్చడానికి చాలాసేపు శ్రమ పడ్డాడు.ఇప్పుడు ఆ రెండింటితో ఆడుకుంటూ మాట్లాడుకుంటూ అదో ఆనందంలో పడిపోయాడు.

పాపం.. అన్నాడు సారథి.

నువ్వు దేనికి జాలి పడుతున్నావో తెలియదు గాని ఇంకో సంగతి చెప్పాలి- అతను ఎక్కుతున్నప్పుడే ఒకటిన్నర లీటరు కూల్ డ్రింకు బాటిల్ తెచ్చుకున్నాడు. మధ్య మధ్య దాన్ని ఎత్తి పట్టుకుని మహదానందంగా సిప్‌చేస్తూ చుట్టూ చూస్తున్నాడు... ఆ క్షణంలో చూస్తే అతనిలో ఏదో అలౌకికానందం వంటిది కనిపిస్తోంది-

'పాపం' అని ఈ సారి వెన్నెల అంది. కాని వేణు గోపాల్ దానిపై ఏమీ వ్యాఖ్యానించకుండా తదుపరి ఘట్టం మొదలెట్టాడు.

⌑ ⌑ ⌑

జడ్చెర్ల దగ్గర బస్సు ఆగగానే చాలామంది దిగడానికి హడావుడిగా లేచారు. హైదరాబాద్ బస్సులో అదో ముఖ్యమైన స్టాప్ అని మీకు తెలుసుగా. దిగిపోయే వారే గాక అక్కడికే తీసుకున్న వారు చాలా మంది వుంటారు. ఖాళీ భర్తీ చేయడానికి కొత్తగా చాలా మంది ఎక్కుతుంటారు కూడా. ఆ రోజూ అలాగే ఎక్కడం దిగడం తొక్కిసలాటగా వుంది. అయితే మధ్యలో ఓ పెద్ద మనిషి అడ్డంగా నిలబడి చికాకు పెడుతున్నాడు. అర్థం కాకుండా మాట్లాడుతూ చికాకు తెప్పిస్తున్నాడు. నాక్కూడా అక్కడ అంత సేపు నిలబడ్డం విసుగనిపించింది. ఇంతకూ అతనెందుకు అడ్డం నిలబడ్డాడు, తాగున్నాడా అర్థం కాలేదు. మామూలుగా అయితే వెళ్లి ఏదో ఒకటి అడిగి సర్దుబాటు చేసేవాణ్నే గాని ముందుకు వెళ్లడానికి వీలు కలగలేదు. ఇలా కాస్సేపు ఇబ్బంది పడ్డాకే అడ్డు తొలగి కిందకు దిగాను.

షరా మామూలుగా కింద టీ తాగి కాస్సేపు అటూ ఇటూ తచ్చాడి మళ్లీ నా ప్లేసులోకి వచ్చాను. ఇంతలోనే బస్సులో మళ్లీ ఏదో రొద. కాస్సేపు పట్టించుకోలేదు గాని అదే పెద్దదైంది. అందరి దృష్టి అటే మళ్లింది. ఏమంటే ఒక పాసింజరు సూట్‌కేసు పోయింది! జడ్జెర్లలో మామూలుగా అక్కడ దొంగతనాలు జరుగుతుంటాయి గనకే ప్రత్యేకంగా హెచ్చరిక బోర్డులు పెడతారు.అయినా మధ్యలో ఎక్కడో ఒక చోట దిగక తప్పదు కదా అని దిగడం... జత గుడ్డలూ, ఒక తుండు,ఒకటి రెండు పుస్తకలు తప్ప మరేం వుండని నా బ్యాగును ఎవరూ తీసుకుపోరని నాకెప్పుడూ భరోసా. ఇప్పుడు దొంగతనం జరిగిందని వినేసరికి నాలోనూ ఒకింత ఆందోళన కలిగి పైన పెట్టిన నా బ్యాగును తడిమి చూసుకున్నాను. అది సురక్షితంగానే వుంది..కాని బస్సులో పెట్టె పోయిన ప్యాసింజరు మాత్రం ఆగేట్టు లేడు. బ్యాగులో పదివేలు వుందంటాడు. దానికోసం కూడ కాదు, ఎటిఎం కార్డు అంతకంటే ముఖ్యంగా డిఫెన్సులో పనిచేసే తన ఐడెంటిటీ కార్డు పోయాయని ఒకటే గోల. కాస్సేపటి తర్వాత అక్కడ ఏకాభిప్రాయం ఏమంటే ఇందాక అందరికీ అడ్డంగా నిల్చి అల్లాడించిన సదరు దేవదాసు గారే దాన్ని కాజేశారని!

'అతను సూట్‌కేసు తీస్తుంటే చూశాను, అతనిదే అనుకున్నాను..' నా ముందు సీటులో అతను చెప్పాడు. 'తాగినట్టున్నాడు తెలియకుండా తీసుకుని వుంటాడు ఇక్కడే చూడండి' మరొకరి ఉచిత ఉదార సలహా. ఆ ఆసామి మాత్రం గుండెలు బాదుకోవడం తప్ప ఇవేం వినిపించుకునేట్టు లేడు. పోయిన తన కార్డులు ఎంత గొప్పవో చెప్పి సానుభూతి పొందడం తప్ప అతనికి మరో ఆలోచనే లేనట్టుంది. దిగి కనీసం అక్కడే చూస్తాడేమో నంటే వూహూ!

'సార్ దిగి చూడండి. అతను బాగా తాగాడు.పెద్ద దూరం కూడా పోయి వుండడు..' ఎవరు ఎంత చెప్పినా అతనిలో స్పందన లేదు.పైగా అతను సూట్‌కేసు తీస్తుంటే చూసి కూడా అడ్డుకోనందుకు ఇతరులపై ఆక్రోశిస్తున్నాడు.నేను కూడా పోలీసుల దగ్గర రికార్డు చేయడం మంచిదని చెప్పాను. వినలేదు. చెప్పిందే చెబుతూ కాస్సేపు కన్నీళ్లు పెట్టుకుంటూ కూలబడి పోయాడు.

బస్సు ఆలస్యం చేయొద్దని అతన్ని దింపేసి వెళ్లిపోదమని మరి కొందరు గొడవ మెదలెట్టారు. తమ ప్రత్యక్ష అనుభవాలు వెల్లడించిన వారు అరిగిపోయిన రికార్డుల్లా అదే అదే చెబుతున్నారు. అభాగ్య ఆసామీ దిగిపోయే సూచనలేమీ లేకపోవడంతో డ్రైవరు బస్సు కదిలించాడు. బస్టాండు దాటి వచ్చే సరికి అక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ నిలబడి వున్నాడు. ఎప్పుడూ పోలీసును చూడని వాడిలా అతను బస్సు ఆపి మరీ దిగిపోయి అతనికి ఆ కానిస్టేబులునికి తన కథ మొత్తం చెప్పుకుని మళ్లీ వచ్చి బస్సెక్కాడు.... నేను ఇవన్నీ ఆలోచించుకుంటూ వెనక సీటులో హాయిగా నిద్రపోయి లేచేసరికి భాగ్యనగరం పలకరించింది....

⌑ ⌑ ⌑

వేణు గోపాల్ చెప్పడం ఆపేశాడు. ఇంకా ఏమైనా చెబుతాడా అని చూశారు సారథి, వెన్నెల.

అదేమీ లేదని తెలుసుకున్నాక అడిగారు. "ఇందులో మీకు పెద్ద గొప్ప విషయాలేమి కనిపించాయి "

'అంతేనా.. సామాన్యంగా సాధారణంగా కనిపించే సంఘటనల వెనకనే అగాధమైన జీవిత సత్యాలుంటాయి. సాహిత్య సందేశాలుంటాయి. ఇందులో ప్రతి ఉదంతంలోనూ జీవితం తాలూకూ భిన్న పార్శ్వాలు, బహు వ్యక్తిత్వాలు వైరుధ్యాలు మీకు కనిపించ లేదా? వేణు గోపాల్ అడిగాడు.అయిదు నిముషాలు ఆలోచించి చెప్పండి. ఈలోగా నేను మొహం కడుక్కొస్తాను' అంటూ లోపలకి వెళ్లాడు.

తిరిగొచ్చి వాళ్లిద్దరికేసి చూసిన తర్వాత అర్థమైందా లేదా అని అడగాల్సిన అవసరం కనిపించలేదు.ఎందుకంటే వారి కళ్లలో కథాత్మను పట్టుకున్న సంతోషం స్పష్టంగా కనిపిస్తోంది.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:

కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

వెనిలా ఐస్‌క్రీమ్

కావలసిన వస్తువులు

పంచదార- 1 కప్పు, కోడిగుడ్డు పచ్చసొన- 4 గుడ్లు, పాలు -లీటర్, క్రీమ్-100 మి.లీటర్లు, వెనిలా ఎసెన్స్-అర టీస్పూన్

తయారుచేయు విధానం

గుడ్ల పచ్చసొన మాత్రమే తీసుకుని ఒక పాత్రలో వేసి పంచదారను దాంట్లో కలపండి. ఈ రెంటిని బాగా మిశ్రమంగా తయారయ్యే వరకు కలియపెట్టాలి. ఇంకొక పాత్రలో పాలను బాగా మరగబెట్టాలి. ఆ తరువాత పాలను చల్లారనివ్వాలి. ఆపాలను తీసుకుని గుడ్ల ద్రావణంలో నెమ్మదిగా కలపాలి. ఒక పెద్ద పాత్రలో నీరు పోసి ఆ నీటిని నెమ్మదిగా వేడి చేస్తుండాలి. అప్పుడు పాలు, గుడ్లు మిశ్రమమున్న పాత్రను ఆ నీటిలో దించి వేడి చెయ్యాలి. మధ్యలో కలియపెడుతుండాలి. ఆ మిశ్రమం గట్టిపడేవరకు ఉంచి ఆ తరువాత దించివేయాలి. ఇది చల్లారిన తరువాత ఎసెన్స్ వేసి కలియబెట్టాలి. ఆ తరువాత ఐస్ క్రీం బాక్సులో వేసి పైన పాలిథిన్ కవర్ మూత ఉంచి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. గట్టిపడిన తరువాత తీసి మనకు నచ్చిన కప్పులలో వేసి మళ్లీ ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఇప్పుడు తీసి చూడండి. మంచి రుచిగా ఉంటుంది.



కావలసిన వస్తువులు

పాలు-లీటరు

పాలపిండి -3 స్పూన్లు

క్రీమ్ - 2 స్పూన్లు

పంచదార - అరకప్పు

వెనిల్లా ఎసెన్స్ -1/2 స్పూన్

వెనిల్లా ఫ్లావర్ వున్న

కష్టర్డ్ పౌడర్ -1 స్పూన్

సాధారణ ఐస్‌క్రీమ్

తయారుచేయు విధానం

లీటర్‌పాలలో కష్టర్డ్ పౌడర్‌ను కలపాలి. దాన్ని బాగా మరిగించాలి. పాలపిండిని, పంచదారను విడిగా కొద్దిగా పాలతో మిశ్రమంగా తయారుచేసి దీన్ని మరుగుతున్న పాలతో కలపాలి. ఆ తరువాత మొత్తం మిశ్రమాన్ని బాగా కలుపుతూ పాలను చిక్కబడేంతవరకు మరగనివ్వాలి. కలిపేస్పూనుకు అంటుకునేంత వరకు ఉంచాలి. ఆ పదార్థం చల్లారిన తరువాత క్రీమ్‌ను, వెనిలా ఎసెన్స్‌ను వేసి బాగా కలియపెట్టాలి. ఐస్‌ట్రేలో ఈ మొత్తం మిశ్రమాన్ని వేసి దాని పైభాగాన ఒక పోలిథిన్ కాగితాన్ని ఉంచాలి. ఆ తరువాత దాన్ని ఫ్రిజ్‌లో ఉంచాలి. గట్టిపడిన తరువాత ఒకసారి తీసి బాగా కలియపెట్టి మళ్లీ ఫ్రిజ్‌లో ఉంచాలి. తినేముందు డ్రైఫ్రూట్స్ ముక్కలు చల్లుకుని తింటే బాగుంటుంది.



పైనాపిల్ షేక్

కావాల్సిన వస్తువులు

అనాసపండు- 1

నిమ్మపళ్ళు- 3

పంచదార- 2 కప్పులు

దాల్చిన చెక్క- కొంచెం

ఎసెన్స్ (పైనాపిల్) - 1 చుక్క

మీగడ- కావలసినంత

తయరుచేయు విధానం

అనాసపండు చితక్కొట్టి కొంచెం నీళ్లుచేర్చి వడగడితే రసం వస్తుంది. నిమ్మకాయలు రసం తీసి వుంచుకోవాలి. దాల్చినచెక్క పొడుం చేసుకుని వుంచుకోవాలి.

అనాసరసం, పంచదార, నిమ్మరసం, దాల్చిన చెక్క పొడి, ఎసెన్సూ కలిపి ఒక పాత్రలోవేసి పొయ్యిమీద పెట్టి మరగబెట్టాలి. బాగా చల్లారిన తర్వాత ఐస్‌తో గాని, వట్టిదిగాని గ్లాసులో పోసుకుని తాగవచ్చు. తాగేముందు మీగడ కలుపుకుంటే ఇంకా బాగుంటుంది. అవసరమైతే నీళ్ళు, పంచదార కూడా కలుపుకోవచ్చు.



పైనాపిల్ ఐస్‌క్రీమ్

కావాల్సిన వస్తువులు

అనాసకాయ - 1

పాలు- అరలీటరు

మీగడ- ఒకటిన్నర కప్పు

పంచదార- 1 కప్పు

వెనిలా- 2 చెంచాలు

ఎసెన్స్ (పైనాపిల్) - 2 చుక్కలు

తయరుచేయు విధానం

అనాసకాయ శుభ్రంగా దంచి సన్నని గుడ్డలో వడగట్టి రసం తియ్యాలి. దీనిని వేరే వుంచుకోవాలి. పాలు పంచదార, మీగడ, ఎసెన్స్ కలిపి ఫ్రిజ్‌లో వుండాలి. కొద్దిగా గట్టిపడ్డాక అనాసరసం పొయ్యాలి. బాగా గడ్డకడితే ఐస్ క్రిమ్ అవుతుంది. చల్లచల్లగా తింటే భలే బావుంటుంది.

ఏడు తరాలు

'ఏడు తరాలు'. ఇది 2 ఖండాలు (ఆఫ్రికా, అమెరికాలోని), 2 జాతుల (కారు నలుపు బానిసలు, తెల్లజాతి) మధ్య 2 శతాబ్దాల పాటు సాగిన 7 తరాల యదార్థ, వ్యదార్థ చరిత్ర.

ఇప్పటికి ఈ పుస్తకం 37 భాషల్లోకి అనువదించబడింది. అమెరికాలో గొప్ప ప్రభావం చూపింది. 'రూట్స్' నవలను మినీ సీరిస్‌గా చిత్రించి అమెరికన్ టీవీలో వారంరోజుల పాటు సీరియల్‌గా ప్రదర్శించారు. ఈ రచనకు అంతర్జాతీయ 'ఫిలిట్జర్' బహుమతి లభించింది. "అమెరికాలో చదవటం వచ్చిన ప్రతివ్యక్తి ఈపుస్తకం కొన్నాడు. చదువురాని ప్రతిబానిస కుటుంబం దీన్ని కొని 'బైబిలులా' ఇంట్లో పదిలంగా దాచుకుంది. తన పూర్వీకులు చేసిన పాపాలకు కృంగిపోయి తల వాల్చుకున్న ప్రతి తెల్లవాడూ ఈ పుస్తకంలో తల దూర్చాడు" (ముందుమాట నుండి) వంటి వాక్యాలతో నిండిన ఈ పుస్తకం ప్రారంభం నుండి ముగింపుదాకా ఆపకుండా చదవాలన్న ఆసక్తిని కలిగిస్తుంది. సహవాసి అద్భుత అనువాదం వల్ల - ఒక పరభాష గ్రంథం చదువుతున్న భావన ఏ మాత్రం కల్గించదు. తెలుగులో ఈ నవల ఇప్పటికే పదిసార్లు పునఃముద్రితమవ్వడం విశేషం.



- సింధు

'ఏడుతరాలు కథ అంటే పెట్టుబడిదారీవిధానం అభివృద్ధిక్రమం తెలిపే కథ. ఈ నవలలో ఆఫ్రో- అమెరికన్ బానిసలను మొదట వ్యవసాయ క్షేత్రాల అభివృద్ధికి వినియోగించారు. అనంతర కాలంలో మిల్లులు, ఓడరేవులు, రైలు మార్గాల నిర్మాణాలలో పని చేయించేందుకు బానిసలు పెద్ద సంఖ్యలో అవసరం అయ్యారు. దీనితో బానిసల రేట్లు రెట్టింపయ్యాయి. అనేక మంది భూస్వాములు తమ వద్ద వుండే కుర్ర బానిసలకు కమ్మరం వగైరా వృత్తులలో శిక్షణ ఇచ్చి వారిని అధిక రేట్లకు పెట్టుబడిదార్లకు అమ్మేశారు. ప్రముఖ ప్రజాస్వామికవాది అబ్రహాంలింకన్ అమెరికా అధ్యక్షుడయ్యాక బానిసలందరికీ "స్వాతంత్ర్యం" చట్టబద్ధం చేశాడు. వారం తిరక్కుండానే శ్వేత జాతి దురహంకారుల తుపాకి గుండ్లకు ఆయన బలయ్యాడు. ఈ క్రమం పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి అవసరమైన చౌక శ్రమశక్తి (స్వతంత్ర బానిసలు) ని ఇబ్బడి ముబ్బడిగా అందించింది.

అటువంటి ఈ నవల రచయిత అలెక్స్ హెలీ. ఆయన పుట్టింది, పెరిగిందీ అమెరికాలోనే. చదువులు నేర్చిందీ అక్కడే. తన 17వ ఏట తీర రక్షకదళం భోజనశాల పనిలో చేరాడు. అధికారిగా ఎదిగాడు. ఖాళీ సమయంలో కథల పుస్తకాలు చదివాడు. స్వయంగా తానే కథలు వ్రాయటం ప్రారంభించాడు. కథా రచనలో పరిణితి సాధించాడు. అనేక బహుమతులు పొందాడు. ఈ నవల రచనాకాలం నాటికి అమెరికాతోపాటు పలు దేశాల విశ్వవిద్యాలయాలలో ఆయన విజిటింగ్ లెక్చరర్. తగినంత సంపద ఉంది. సమాజంలో గుర్తింపు వుంది. అయినా ఆయనను ఒక కొరత పీడించింది. తన చిన్నతనం నుండీ, తన వారి నుండి బొట్లు, బొట్లుగావిన్న తన 'వంశవృక్షం' చరిత్రను లోతుగా తెల్సుకోవాలి. ఆఫ్రికాలోని తన వారిని కల్సుకోవాలి. తన పూర్వీకుల కష్టాలకు, అవమానాలకు కారణమైన 'వర్ణ వివక్షతను' అంతమొందించాలన్నది తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నాడు. అనేక పౌరహక్కుల ఉద్యమాలతో మమేకమయ్యాడు.

తన లక్ష్య సాధనకు పది సంవత్సరాలపాటు ఏకాగ్రతతో అధ్యయనం చేశాడు. అమెరికాలో, ఇంగ్లాండులోని పలు గ్రంథాలయాలు తిరిగాడు. పలు ప్రభుత్వ డాక్యుమెంట్లు చదివాడు. తమ వంశవృక్ష మూలపురుషుడు 'కుంటే'ను బంధించి అమెరికా తరలించిన ఓడను ఇంగ్లాండ్‌లో చూశాడు. 5 లక్షల మైళ్ళు ప్రయాణించాడు. ఆఫ్రికాకు పలుసార్లు వెళ్ళాడు. అంతిమంగా తన గమ్యం..... ఆఫ్రికాఖండంలో, గాంబియాలోని జాఫూర్ గడ్డపై కాలు పెట్టాడు. ఆ నేలను ముద్దాడాడు. అక్కడ చేరిన తన వంశీయుల బిడ్డలను గుండెలకు హత్తుకొని మురిసిపోయాడు. అనుభూతి సంద్రంలో మునిగి 'ముత్యాన్ని' కనిపెట్టి, వెలికి తెచ్చినంత ఆనందం పొందాడు. తన జన్మ పావనమైందని పులకించాడు.

"స్వచ్ఛమైన నెత్తురు ప్రవహించే నిక్కమైన మనుషుల మధ్య సంకరజాతి రక్తం పంచుకు పుట్టిన కల్తీ మనిషిని నేను. నిష్కళంకమైన ఈ మనుషుల మధ్య మైలపడ్డ మనిషిని నేను."... ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "ఏడుతరాలు (రూట్స్)" నవలా రచయిత అలెక్స్ హెలీ ఉద్వేగభరిత ఆత్మఘోష అది. అక్కడి తన వారందరూ కారునలుపు రంగులో ఉన్నారు. తాను మాత్రం ఎర్రగా ఉండటాన్ని అవమానకరంగా భావించాడు. హృద్యమైన ఇలాంటి ఘటనలు ఈ నవలలో అనేకం.

సామాజిక, విప్లవోద్యమాలలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్త స్పష్టంగా 'నేను ఎవర్ని?' అనే ప్రశ్నతో ప్రారంభించాలి. చరిత్రను శోధించాలి. అనుభవాలు గడించాలి. 'నేను ఏం చేయాలి?' అనేది నిర్వచించుకోవాలి. ఆ లక్ష్య సాధనలో అలెక్స్ హెలీ పట్టుదల, దీక్షను మనం సంతరించుకునేందుకు యత్నిద్దాం.

అందుకే "ఏదీ తనంత తానై నీదరికి రాదు. శోధించి సాధించాలి. అదియే ధీర గుణం" అన్నాడు మహాకవి శ్రీశ్రీ.

7తరాల వంశవృక్షానికి మూల పురుషుడు కుంటా కింటే. ఆఫ్రికాఖండంలోని గాంబియా ప్రాంతం ముస్లిం గిరిజన గ్రామం జాఫూర్‌లో పుట్టాడు. స్వేచ్ఛగా పెరిగాడు. మగాడిగా ఎదిగేందుకు పలు విద్యలు నేర్చాడు.

అమానుషమైన బానిసవ్యవస్థను బద్దలు కొట్టేందుకు అనేక తిరుగుబాట్లు లేచాయి. నల్ల బానిసలను "విముక్తి" లక్ష్యంవైపు కదిలించాయి. పలువురు నాయకులు వురికంబాలెక్కారు. అనేక మంది ప్రాణాలు పోయాయి. ఫ్రెడరిక్స్‌బర్గ్‌లో స్వతంత్రత కమ్మరి గాబ్రియేల్ అనే నల్లవాడు తిరుగుబాటుకి సూత్రధారుడు. బట్లర్‌లు, వాచెమెన్‌లు, వెయిటర్లు, ఇనుప పనివాళ్ళు, గని కార్మికులు, సరంగులు, ఆఖరుకి మత ప్రచారకులుగా పని చేసే నల్ల బానిసలు అనేకులు తిరుగుబాట్లుతో చేరారు. కొన్ని క్రైస్తవ సంస్థలు, నల్లముస్లిం సంస్థలూ బానిస వ్యతిరేక ఉద్యమాలకు నాయకత్వం వహించాయి. నల్లజాతి మహిళలూ ఈ పోరాటాలకు నాయకత్వం వహించారు.

మూడుపూటలా అల్లాకి నమాజ్ చేశాడు. "అడవిలో పులులూ, సింహాలు కంటే ప్రమాదకరమైన తెల్ల బూచోళ్ళుంటారు. ఆదమరిచావంటే అమెరికా ఎత్తుకుపోయి బానిస సంతలో అమ్మేస్తారు-జాగ్రత్త !" అంటూ కథల పెద్దమ్మ పదే పదే చెప్పిన పలు గాథలు విన్నాడు. అడవిలో కట్టెల కోసంపోయి తన 17వ ఏట తెల్లపిశాచాలు, బానిస వ్యాపారుల వలలో చిక్కాడు. తప్పించుకునేందుకు శత విధాల పోరాడాడు. సంకెళ్ళతో 6 నెల్ల దుర్భరమైన ఓడ ప్రయాణం తర్వాత అమెరికా బానిస మార్కెట్‌లో అమ్మబడ్డాడు.

'ఇక నా పని అయిపోయింద'ని కుంటా నిరాశ చెందలేదు. అమెరికా బానిస యజమానుల నుండి తప్పించుకునేందుకు కనీసం 3 సార్లు, విఫలయత్నం చేశాడు. తెలియని ప్రాంతం, కొరుక్కు తినే చలిలో, మంచు నేలపై అలుపు, ఆయాసాలను లక్ష్య పెట్టలేదు. కటిక చీకటి...... దోవా తెన్నులేని అడవిలో రోజుల పర్యంతం పరుగులు తీశాడు. ప్రతిసారీ తెల్లదాదాలకు, వారివేట కుక్కలకు దొరికిపోయాడు. చావుదెబ్బలు తిన్నాడు. చివరి యత్నంలో తెల్లజాతి తొత్తు కొడుకులు గొడ్డలితో కుంటా పాదాన్ని సగం వరకు నరికేశారు. 'కుంటి కుంటా'గా జీవితాంతం పట్టుదలగా జీవించాడు. తన భార్య (మరో నల్ల బానిస); బిడ్డ కిజ్జీకి తన కథ చెప్పాడు. ఆఫ్రికా గురించి, తన వంశీయుల శౌర్యం, ప్రతాపాల గురించి నూరిపోశాడు. ముందు తరాల వారందరికీ తమగాథ చెబుతూనే ఉండాలని వారిని ఆదేశించాడు. ఆయన అమెరికా విచ్చలవిడి సంస్కృతితో రాజీపడలేదు. ఆఫ్రికన్ కష్టజీవుల సంస్కృతిని విడనాడలేదు.

నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో, మన సమాజాన్ని అమెరికాకు బలిపెట్టాలని మన పాలకులు కుట్రలు పన్నుతున్నారు. ఈ కుట్రలను ప్రతిఘటించేందుకే పలు ప్రజా పోరాటాలు, ఉద్యమాలు సాగుతున్నాయి. వేలాది యువ కార్యకర్తలు ఈ పోరాటాలలో పలు నిర్బంధాలను ఎదుర్కుంటున్నారు. వారందరికీ 'కుంటా' తిరుగుబాటు తత్వం, ఆత్మస్థయిర్యం ఆదర్శం కావాలి.

ఈ నవల 'మేడిపండు అమెరికన్ సంస్కృతి' పొట్టవిప్పి చూపింది. తమది 'అభివృద్ధి చెందిన దేశం'గా అహంతో చెప్పుకునే అమెరికన్లు, ఆ అభివృద్ధికి మూలమైన ఆఫ్రికన్ నల్లజాతి బానిసలను పశువులుకన్నా హీనంగా చూశారు. వారిని అనాగరికులుగా, చరిత్రహీనులుగా నిందించారు. అలాంటి తెల్లదొరలు తమ లాభాల కక్కుర్తిని, లైంగిక కుతిని నీగ్రో మగ, ఆడ బానిసలతో తీర్చుకున్నారు. 'నీగ్రోలు', 'నిగ్గర్లు' .... ఈ పదాలు తెల్లదొరలు సృష్టించిన తిట్టు శబ్దాలు. నవలలో ప్రస్తావించిన తెల్లదొరల మధ్య జరిగిన కింది సంభాషణ పైఅంశాలను ధృవపరుస్తుంది.

"ఇవాళ భూమి మీద, బానిసల మీద పెట్టే పెట్టుబడిని మించింది వేరొకటిలేదు. బానిసలు మన వ్యవస్థకి వెన్నెముకలు"

"ఈ నిగ్గర్లు ప్రతి యేటా కని పడేస్తారు. దానివల్ల ఎంత లాభం? ఆ కుర్ర బానిసలకు వృత్తుల్లో తర్ఫీదు ఇస్తే ఉపయోగపడేవాళ్ళు కోకొల్లలు. వాళ్ళ విలువ పెరుగుతుంది"

ఇదీ తెల్ల భూస్వాముల వ్యాపారదృష్టి.

" పట్టణాల్లో ఎటు చూసినా వాళ్ళే. రేవులు, గిడ్డంగులు, వ్యాపారాల్లో వాళ్ళే..... లీన్‌బర్గ్ పట్టణం మొత్తంలో మంగలి పని చేసే తెల్లవాడుంటే ఒట్టు."

"పత్తి నుంచి గింజల్ని విడదీసే యంత్రం వాడుకలోకి రాగానే పత్తి తోటల ఆసాములకు పట్ట పగ్గాల్లేవు..... బానిసల రేట్లు రెట్టింపయ్యాయి. ఏదైనా వృత్తుల్లో అనుభవం వున్న బానిసల రేట్లు 2 1/2 వేల దాకా ధర పలుకుతుంది. మిసిసిపి, అలబామా రాష్ట్రాలకు వెళ్ళే రైళ్ళు బానిసలతో కిటకిటలాడుతున్నాయి."

అమానుషమైన బానిసవ్యవస్థను బద్దలు కొట్టేందుకు అనేక తిరుగుబాట్లు లేచాయి. నల్ల బానిసలను "విముక్తి" లక్ష్యంవైపు కదిలించాయి. పలువురు నాయకులు వురికంబాలెక్కారు. అనేక మంది ప్రాణాలు పోయాయి. ఫ్రెడరిక్స్‌బర్గ్‌లో స్వతంత్రత కమ్మరి గాబ్రియేల్ అనే నల్లవాడు తిరుగుబాటుకి సూత్రధారుడు. బట్లర్‌లు, వాచెమెన్‌లు, వెయిటర్లు, ఇనుప పనివాళ్ళు, గని కార్మికులు, సరంగులు, ఆఖరుకి మత ప్రచారకులుగా పని చేసే నల్ల బానిసలు అనేకులు తిరుగుబాట్లుతో చేరారు. కొన్ని క్రైస్తవ సంస్థలు, నల్లముస్లిం సంస్థలూ బానిస వ్యతిరేక ఉద్యమాలకు నాయకత్వం వహించాయి. నల్లజాతి మహిళలూ ఈ పోరాటాలకు నాయకత్వం వహించారు.

సమాజంలో అట్టడుగుకు నెట్టబడి, నిస్సహాయ స్థితిలో వున్న బాధా సర్పద్రష్టుల హృదయాలను ఈ నవల కదిలిస్తుంది. బతుకులో విశ్వాసం నింపుతుంది. నూతన ఉత్తేజాన్ని కల్గిస్తుంది. ప్రపంచీకరణ పేర మన సమాజంలో దోపిడీ, పీడన, పలు రకాల వివక్షలు ముమ్మరమైన కాలం ఇది. మానవ విలువలకు, మానవ హక్కులను పాతరవేస్తున్నారు. దళితులు సామాజిక వివక్షలో మగ్గిపోతున్నారు. బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతున్నది. మహిళలు అంగడి సరుకై రెడ్‌లైట్ ఏరియాలలో అమ్మివేయబడుతున్నారు.

పై వివక్షతలను, అన్యాయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరికి 'ఏడుతరాల' నవల అధ్యయనం ఒక మంచి టానిక్‌లా ఉపకరిస్తుంది. అందుకే ఈ నవల ఓ మంచి పుస్తకంగా భాసిల్లుతున్నది. తీవ్ర నిర్బంధాలు, వర్ణవివక్షత అమలవుతున్న కాలంలోనే పరాయి గడ్డపై 'నల్ల బానిసల తిరుగుబాట్లు' మనకు చైతన్య దీపికలు కావాలి. ఆ వెలుగులో మన ఉద్యమాలను మరింత సమరశీలంగా మల్చుకోవాలి. ★

ప్రేరణ...

పుస్తకం, అదో ప్రపంచం. అట్ట తీసి లోపలికి ప్రవేశించామంటే చాలు! సమయం తెలియనివ్వదు. మరోపని చేసుకోనివ్వదు. అందులో పేర్కొన్న సంఘటనలు మన కళ్లముందు జరుగుతున్న అనుభూతిని కలిగిస్తుంది. ఒక్కోసారి కంటతడి పెట్టిస్తుంది. మరోసారి పిడికిలి బిగించేలా చేస్తుంది. ఇంకోసారి అన్యాయంపై తిరగబడేలా...తెగబడేలా ప్రేరేపిస్తుంది. అంతటి శక్తి పుస్తకంలో వుంది.

మనం చదివిన అనేక పుస్తకాలలో కొన్ని... కనీసం ఒక పుస్తకమైనా మనలో ప్రేరణను, ఉత్తేజాన్ని నింపుతుంది.

నిత్యం జనాల మధ్యే వుంటూ... పీడితప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే... కొంతమంది నాయకులకు ప్రేరణ ఇచ్చిన పుస్తకాల గురించి ప్రతి వారం వారి మాటల్లోనే ఇవ్వాలనుకుంటున్నాం.

ఇంతవరకు మంచి పుస్తకం శీర్షికను ఆదరించిన మీ అందరికీ ధన్యవాదాలు తెల్పుకుంటూ ఆ స్థానంలో రానున్న ఈ కొత్త శీర్షిక మిమ్మల్ని కూడా ఉత్తేజితుల్ని చేస్తుందని భావిస్తూ...

ఎడిటర్, ప్రజాశక్తి.

బీర్బల్ కథలు

కోడిపుంజు-2

కళ్లు మూసిందా?

తెరిచిందా?

పిల్లలూ... అమ్మాయి కళ్లు చూడండి. మూసింద
తెరిచిందా? తికమకగా ఉందికదూ! కనుగుడ్ల మీద
పెట్టి చూడండి. కళ్లు మూసుకున్నట్లు అనిపిస్తుంది.
కింది కనురెప్పల మీద వేళ్లు పెట్టి చూస్తే కళ్లు తెరిచి
అనిపిస్తుంది. అదే ఈ వారం చిత్ర విచిత్రం.



పదాలు చేద్దామా...

పిల్లలూ... పైన ఉన్న షడ్భుజంలో కొన్ని అక్షరాల
ఉన్నాయి. వాటిలో నాలుగక్షరాలు, అంతకంటే
ఎక్కువ తీసుకుని వాటితో మీకు వీలైనన్ని పదాల
చేయండి.

ఎలా?

హలో ఫ్రెండ్స్...ఈ బొమ్మని చూశారుగా. ఎలా వుంది. చిరాగ్గా చూస్తున్నట్లు ఉందికదా. దీన్ని నవ్వేలా చేయగలరా?

జవాబులు

కనిపెడదామా...! : పింకీ- చేప, టామీ- ఎలుక, జాకీ- యాపిల్.

పదాలు చేద్దామా... :arch,cash, char, clash, crash, halo,lash,loch,rash,roach,scholar,shoal.

ఆవులెన్ని?: 42

తేడాలేంటో...: వాన్ డోర్‌కు ఉన్న హాండిల్, అమ్మాయి డ్రెస్ ఎడమచేయి, నిచ్చెన కింది భాగం, అమ్మాయి డ్రెస్ ముందుభాగం, గొడ్డలి పక్కనున్న బాక్స్ మూత.

ఎలా? : పుస్తకాన్ని తిప్పి చూడండి.

సుడోకు:

1	2	3	4	5	6	7	8	9
4	5	7	1	8	9	2	3	6
6	8	9	2	3	7	1	4	5
8	1	5	3	6	2	9	7	4
2	7	4	8	9	1	6	5	3
3	9	6	5	7	4	8	1	2
5	4	2	6	1	8	3	9	7
7	6	1	9	4	3	5	2	8
9	3	8	7	2	5	4	6	1

కనిపెడదామా...!



హాలో
బుజ్జాయిలూ...
పింకీ, టామీ,
జాకీలు వాటికి
నచ్చిన ఆహారాన్ని
తినటానికి రెడీగా
ఉన్నాయి.
అయితే ఏది
వాటికి నచ్చిన
ఆహారమో
కనిపెడదామా.

	2		4	5	6	7	8	9
4	5	7		8		2	3	6
6	8	9	2	3	7		4	
		5	3	6	2	9	7	4
2	7	4		9		6	5	3
3	9	6	5	7	4	8		
	4		6	1	8	3	9	7
7	6	1		4		5	2	8
9	3	8	7	2	5		6	

సుడోకు

హాలో పిల్లలూ... ఈ బాక్సులో మొత్తం 9 చిన్న బాక్సులు ఉన్నాయి. ప్రతి బాక్సులో 1నుండి 9 వరకు అంకెలు ఉండాలి. అయితే ఈ 9 బాక్సులు ఒకే బాక్సులో ఉన్నాయికదా. అలా మొత్తంగా అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా చూసినా 1 నుండి9 అంకెలే ఉండాలి. ఏ ఒక్క అంకెకూడా రెండు సార్లు రాకూడదు. మరి ఖాళీగా ఉన్న గడులను పూరిస్తారా? చివరకు మా సమాధానంతో పోల్చుకోండే!

ఆవులెన్ని?

హాయ్ ఫ్రెండ్స్.... ఇంగ్లీషులో ఆవుని ఏమంటారో తెలుసుగా. ఆ పదమే కింద ఉన్న బాక్సులో బోలెడు సార్లు వచ్చింది. తలకిందులుగా, అడ్డంగా, నిలువుగా..ఇలా చాలా చోట్ల వుంది. అయితే మీరు ఏం చేయాలంటే ఆపదం ఎన్నిసార్లు వచ్చిందో లెక్కపెట్టి చెప్పాలి.

d	x	o	a	w	v	w	v	l	w
d	x	h	x	l	k	o	g	r	p
b	x	o	u	o	x	a	o	c	z
f	r	r	x	a	y	x	x	b	x
l	x	o	c	o	j	o	d	o	e
m	q	w	x	m	q	u	j	s	o
n	g	d	o	w	h	o	p	x	p
l	o	x	e	g	x	y	x	h	a
x	j	x	f	z	c	o	j	w	e
o	z	o	j	j	t	r	n	p	f

ఐదు తేడాలేంటో...

అట్టమీది కథ



ఖరీదైన పెళ్లిళ్లు మారుతున్న సాంప్రదాయాలు

పెళ్లి...జీవితంలో మరపురాని మధురస్మృతి. రెండు హృదయాల పరిపూర్ణ పరిష్వంగ కలయిక. రెండు కుటుంబాల ఆత్మీయ, ఆప్యాయ పలకరింత. సనాతన కాలం నుండి భారతీయ వివాహ వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయి. ప్రపంచదేశాలన్నీ మన వివాహ బంధానికి 'సలాం' చేస్తూనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో భారతీయ సాంప్రదాయాల ప్రకారం వివాహాలు చేసుకొనేందుకు పాశ్చాత్యులు సైతం ఆసక్తి కనబరచడం మనం తరచూ చూస్తూనేఉన్నాం. భారతదేశంలో మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు వేరైనా వివాహ బంధంలోని పరమార్థం, పవిత్రత ఒక్కటే. ఒకప్పుడు కుటుంబ వేడుకలుగా జరిగే వివాహతంతు కార్యక్రమాలు కాలక్రమేణా విలాసవంతమైన వేడుకలుగా మార్పు చెందాయి.

- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

దీనికి నేటి సినిమాల ప్రభావం తోడై పెళ్లంటే ఇలా ఉండాలి అనే భావాన్ని యువతీయువకుల్లో చొప్పించి ఈ వేడుకలను మరింత ఖరీదుగా మార్చేశాయి. ఒకప్పుడు రాజవంశీకుల ఇళ్లలో అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకలు నేటి మధ్యతరగతి ప్రజలను కూడా ఆవైపు లాక్కెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. తాటాకు పందిళ్ల స్థానంలో ఫంక్షన్‌హాళ్లు, షామియానాలు, మామిడితోరణాల స్థానంలో ప్లాస్టిక్ ఆకులు, పుష్పాలంకరణలో ప్లాస్టిక్ పూలు కలగలసి, ఖరీదైన పెళ్లిళ్లను చౌకగా మధ్యతరగతికి అందుబాటులోకి తెచ్చాయి. ఆర్థిక స్థోమత లేకున్నా అప్పుచేసైనా పెళ్లి వేడుకలు ఘనంగా జరుపుకోవాలనే ధోరణి క్రమేణా బలపడుతోంది. అందుకే దేశవ్యాప్తంగా ఫంక్షన్ హాళ్లకు ఎక్కడలేని డిమాండ్ పెరుగుతుంది. సంవత్సరంలో నెలరోజులు ఫంక్షన్ హాళ్లు బుక్ అయితే చాలు. సంవత్సరాదాయం సంపాదించినట్లే. కట్నకానుకలు తక్కువ ఇచ్చినా ఫరవాలేదు. పెళ్లి మాత్రం ఘనంగా చేయాలంటూ వరుడి తరఫువారు ముందే ముందరి కాళ్లకు బంధాలేస్తున్నారు. మొత్తానికి ఈ వేడుకల మూలంగా అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

ఖరీదైన పెళ్లి పత్రికలకు పెరుగుతున్న డిమాండ్

వివాహ వేడుకలు అట్టహాసంగా జరుగుతాయనడానికి పెళ్లిపత్రికల సెలక్షనే తొలిమెట్టు. ఇటీవలి కాలంలో ఖరీదైన పత్రికలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. వెండి, తామ్ర పత్రాలపై శుభలేఖలు ముద్రించి తమ అభిమతాన్ని ముందుగానే బంధుమిత్రులకు తెలియజేయడం రివాజుగా మారుతోంది. కంప్యూటర్ యుగంలో కావాల్సిన డిజైన్, హంగుఆర్భాటాలు కలగలిపి ప్రత్యేకంగా పత్రికలను తయారుచేయించుకోవడం ఫ్యాషన్‌గా మారింది. గతంలో పసుపు రంగు కాగితాలపై పత్రికలను అచ్చువేసి బంధుమిత్రులకు పంచేవారు. నేడు ఆ కాగితాలే కనిపించట్లేదు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా పెళ్లి పత్రికల్లోనూ పెను మార్పులు చోటుచేసుకున్నాయి. "మేము గత 40 సంవత్సరాలుగా పెళ్లిపత్రికల వ్యాపారం చేస్తున్నాం. కేవలం గడచిన ఐదారు సంవత్సరాలుగా ఈ వ్యాపారంలో విశేషమైన మార్పులు వచ్చాయి. గ్రామాల నుండి వచ్చే వారుకూడా పత్రికల సెలక్షన్ విషయంలో రాజీ పడటంలేదు. వారి స్థోమతకు మించినదైనా ఖరీదైన పత్రికలనే సెలక్ట్ చేసుకుంటున్నారు" అని సికింద్రాబాద్‌లోని దీక్షితా కలెక్షన్స్ యజమాని కె.వెంకన్న చెప్పారు. హైదరాబాద్ నగరంలో పెళ్లి పత్రికల వ్యాపారానికి చెత్తాబజార్ పేరుమోసిన ప్రాంతం. ఇక్కడికి దూర ప్రాంతాలనుండి కూడా వచ్చేవారు ఎక్కువ. పత్రిక సెలక్షన్ చేసుకుంటే గంటలో వారే ప్రింటింగ్ చేసి ఇస్తారు. ఈ ప్రాంతానికి చెందిన మహ్మదీయ కార్డ్స్ అండ్ ప్రింటర్స్ అధినేత మహ్మద్ గఫూర్ మాట్లాడుతూ "గతంలో కన్నా ఇప్పుడు మా వ్యాపారాలు బాగున్నాయి. స్వంత ఆలోచనలతో మేమే పత్రికలకు డిజైన్ చేసి కష్టమర్లకు చూపెడుతున్నాం. కంప్యూటర్ల ద్వారా వారికి అవసరమైన మార్పులు కూడా చేస్తున్నాం. ధర విషయంలో ఎవరూ అంతగా బేరాలాడటం లేదు. పత్రిక మాత్రం 'రిచ్ లుక్' లో ఉండాలని కోరుకుంటున్నారు" అని చెప్పారు.

నోరూరిస్తున్న మెనూ

మారుతున్న కాలంతో పాటు ఆహార అలవాట్లు కూడా మారుతున్నాయి. ఒకప్పుడు పప్పు, కూర, పచ్చడి, వేపుడు, సాంబారు, స్వీటుతో పాటు చికెన్ లేదా మటన్ మెనూలో ఉండేవి. ఇప్పుడవి పాతబడి ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ పెరిగిపోయింది. మెనూలో దాదాపు 20 నుండి 40 రకాల ఐటమ్స్ ఉంటున్నాయి. బగారా రైస్, వైట్‌రైస్, జీరారైస్, ఫ్రైడ్‌రైస్, చికెన్ మంచూరియా, గోబీఫ్రై, పరాఠా, రుమాలీరోటీ, ఖుర్బానీకా మీటా, బాసుండి, రసగుల్లా అంటూ రకరకాల పదార్థాలు ఆహ్వానితులకు నోళ్లలో నీరూరిస్తున్నాయి. "ఇటీవలి కాలంలో పెళ్లిళ్లలో మెనూలు చూస్తే మాకే

ఆశ్చర్యం వేస్తోంది. దాదాపు 30 నుండి 40 రకాల వంటలు చేయిస్తున్నారు. ఎక్కువగా క్యాటరింగ్ సర్వీస్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. పది రూపాయలు ఎక్కువ తీసుకున్నా ఫరవాలేదు. క్వాలిటీ, రుచుల్లో తేడా రావద్దు" అంటూ హెచ్చరిస్తున్నారని అన్నపూర్ణ క్యాటరర్స్ ప్రొప్రయిటర్ ఎ.పరశురాంరెడ్డి చెప్తున్నారు.

సన్నాయి మేళాలకు తగ్గుతున్న ఆదరణ

సాంప్రదాయక పెళ్లిళ్లు సన్నాయి మేళం లేనిదే జరగవు. కాలక్రమేణా వీటి స్థానాన్ని బ్యాండ్ మేళాలు, ఆర్కెస్ట్రా, డిజెలు ఆక్రమిస్తున్నాయి. గతంలో పెళ్లంటే నాదస్వర బృందాలకు కనీసం మూడు రోజులు పని దొరికేది. బృందంలో ఐదుగురు సభ్యులు ఉండేవారు. ఇప్పుడు కేవలం ఇద్దరు లేదా ముగ్గురు చాలంటున్నారని, ముహూర్త సమయానికి వస్తే చాలని చెప్తున్నారని చిక్కడపల్లిలోని త్యాగరాయ నాదస్వర బృందం ప్రొప్రయిటర్ ఫకీరయ్య తెలిపారు. వీరి స్థానంలో హోరెత్తించే డిజెలు, స్టేజ్‌షోలు నిర్వహిస్తున్నారు.

తూతూ మంత్రంగానే పురోహితుల పాత్ర

పురోహితుడు లేనిదే పెళ్లి వేడుక లేదు. గతంలో ఐదు రోజులు వివాహతంతు నడిచేది. ఇప్పుడు కాలంతో పోటీపడుతూ ఆర్భాటాలకు పోతూ పురోహితుల పాత్రను కూడా తూతూ మంత్రం చేస్తున్నారు. పెళ్లిళ్లలో విఐపిల రాకను 'స్టేటస్ సింబల్'గా చూస్తున్నారు. పెళ్లితంతులో వేదిక మీదే గంటల తరబడి కూర్చుంటే అతిథులను ఆహ్వానించేది ఎలా? అందుకే 'తంతు'ను త్వరగా ముగించమంటూ పురోహితులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో 'కర్త' కు లేని శ్రద్ధ తమకెందుకని వారుకూడా 'మమ' అనిపించేస్తున్నారు. 'తంతు'కు 'సెన్సార్' పడినా సంభావనలో మాత్రం రాజీలేదంటున్నారు.

అరేబియా గుర్రాలపై ఊరేగింపు

తమిళనాడు మాజీ ముఖ్య మంత్రి జయలలిత తన దత్త పుత్రుడి పెళ్ళిని 'రాచరికపు పెళ్ళి' లా చేసి సంచలనం సృష్టించారు. వధూవరుల్ని నిజమైన రథంలో ఊరేగించారు. రథాన్ని లాగడానికి సౌదీ అరేబియా నుంచి నాలుగు మేలుజాతి గుర్రాలను తెప్పించారు. పెళ్ళికొచ్చిన వారందరికీ భారీ బహుమతులు అందజేశారు.

చాకలి, మంగలి వృత్తిదారులకు గుర్తింపు కరవు

హిందూ వివాహ సంప్రదాయాల్లో చాకలి, మంగలి వృత్తిదారులకు ప్రత్యేక గుర్తింపు, హోదా ఉంది. పెళ్లికి పురోహితుడు ఎంత అవసరమో వీరు కూడా అంతే అవసరం. ఆధునిక పెళ్లిళ్లలో వీరి పాత్ర పరిమితమై పోయింది. కేవలం సాంప్రదాయం కోసమే వీరిని కొందరు పిలుస్తున్నారు. వివాహ వేడుకలో వరుడికి గోళ్లు తీయడం ఆచారం. అలాగే తలంబ్రాల బియ్యాన్ని చాకలికి ఇవ్వడం ఆనవాయితీ. వివాహతంతులో వీరు వచ్చివెళ్లింది కూడా ఎవరికీ తెలియడం లేదు. ఆడంబరాలకు ఉన్న ప్రాధాన్యత ముందు వీరికి గుర్తింపే లేకుండా పోయింది!

మండపాల అలంకరణకు ప్రాధాన్యత

పెళ్లి మండపాల అలంకరణకు వధూవరుల తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికోసమే హీనపక్షం రూ.50వేల నుండి లక్ష రూపాయల వరకు కేటాయిస్తున్నారు. ఫంక్షన్ హాళ్లలో ఫౌంటెన్లు, పూలకుండీలు, కూరగాయలతో క్వారియింగ్, అతిథులకు ఆహ్వానం పలికేందుకు ప్రత్యేకంగా యువతుల ఏర్పాటు, పన్నీరు జలతారులు వగైరాలకు లక్షలు ఖర్చుచేస్తున్నారు. హంగు ఆర్భాటాల కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనకాడటం లేదు.

గుర్రపు బగ్గీపై ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణ

వివాహానంతరం అప్పగింతల సమయంలో వధూవరులను ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపుబగ్గీపై ఊరేగింపుగా తీసుకెళ్లడం ఫ్యాషన్‌గా మారింది. ఈ ఊరేగింపుకు ముందు ఒంటెల సవారి, విచిత్ర వేషధారణలు, బారులు తీరి నిలబడి లైట్లను మోసే మహిళా కార్మికులు, డిజెల హోరు, బ్యాండుమేళాల 'తీన్‌మార్'లు, కుర్రకారు కేరింతలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణలు.



ఆ పెళ్ళి ఖర్చు

అక్షరాలా రూ. 300 కోట్లు

★ ప్రవాస భారతీయుడు, 'ఉక్కు దిగ్గజంగా పేరొందిన ఎల్.ఎన్.మిట్టల్ తన కూతురు పెళ్ళికి 300 కోట్ల రూపాయలు ఖర్చుచేసి రికార్డు సృష్టించారు. అత్యంత ఖరీదైన పెళ్ళిగా ఇది గిన్నిస్ రికార్డుక్కూడా ఎక్కింది. ★ ఈ పెళ్ళికి మిట్టల్ 20 పేజీల ఆహ్వాన పత్రాన్ని రూపొందించారు. దీనిని వెండి పెట్టెలో పెట్టి పంపారు. ★ ఐదు రోజులపాటు జరిగిన ఈ పెళ్ళికి దేశ విదేశీ ప్రముఖులు (వివిఐపిలు) 1000 మంది వరకు హాజరయ్యారు వీళ్ళందరికీ పారిస్‌లో అత్యంత విలాసవంతమైన ఐదు నక్షత్రాల హోటల్లో ఐదు రోజులు బస ఏర్పాటుచేశారు. ఈ పెళ్ళికోసం కలపతో అప్పటికప్పుడు బ్రహ్మాండమైన 'కోట' ను నెలకొల్పారు. ★ అంతర్జాతీయ పాప్ గాయకులతో కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పదిహేను లక్షల డాలర్ల విలువైన మద్యం, ఇతర పానీయాలు ఖర్చయ్యాయి. ★ పెళ్ళికొచ్చిన మహిళలందరికీ నగల సంచులు బహుమతిగా ఇచ్చారని చెప్పుకున్నారు.



రిసెప్షన్‌లోనూ అదే ఆర్భాటం

వివాహానంతరం జరిగే రిసెప్షన్ కార్యక్రమంలోనూ దాదాపు ఇదే హంగామా కొనసాగుతుంది. ఆర్భాటాలకు ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదు. తమ పిల్లల పెళ్ళిళ్లు కలకాలం గుర్తుండేలా చేయాలనే తపన ఈ ఏర్పాట్లలో కన్పిస్తుంది.

భారమౌతున్న బంగారం - తప్పని కొనుగోళ్లు

పెళ్లి అంటే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. ప్రస్తుతం దాని ధర చుక్కల్నే చూస్తోంది. అయినా కొనక తప్పని పరిస్థితి. పెళ్లికి కనీసం మూడు నెలల ముందు నుండే బంగారం రేటు ఏమైనా తగ్గుతుందేమోనని ఎదురు చూడాల్సిన రోజులు వచ్చాయి. స్టాక్ మార్కెట్లు తారాజువ్వల్లా పైకెగిరి అంతే వేగంతో ఢమాల్న కిందకు పడుతుండటంతో అక్కడ పెట్టుబడులకన్నా బంగారమే బెస్ట్ అనేది మదుపరుల ఆలోచనగా ఉంది. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.16 వేలకు పైమాటే. గతంలో సీజన్‌లో దీని ధర పెరిగేది. ఇప్పుడు ఏక్షణాన ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. బంగారం వ్యాపారంలో తలపండిన మహామహులకు కూడా ఈ విషయం అంతుపట్టడం లేదు. బంగారం లేనిదే పెళ్లి లేదు. కనీసం తాళిబొట్టు మందానైనా బంగారం కావాల్సిందే. ఈ విషయంలో సంపన్న వర్గాలు దాన్ని పెట్టుబడిగానే భావిస్తున్నాయి. ధరతో సంబంధం లేకుండా కొనుగోళ్లు



జరుపుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ వస్తే బంగారం వ్యాపారంలోని బహుళజాతి సంస్థలు వీరిని ఆకర్షించేందుకు రకరకాల ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. ఈ పోకడ ఎక్కడదాకా వెళ్లిందంటే ఈ వారంలోనే హైదరాబాద్‌లోని ఓ షోరూం ఎంత కొంటే అంత బంగారం 'ఫ్రీ' అంటూ ప్రచారంతో ఊదరగొడుతోంది. దానిలోని మర్మం కష్టమర్లకే తెలియాలి. దీనికితోడు పెళ్లిలో మా అమ్మాయికి ఇంత బంగారం పెట్టాం అని చెప్పుకోవడం కూడా స్టేటస్ సింబల్‌గా మారింది. వ్యాపారులు దీన్నే సొమ్ము చేసుకుంటున్నారు. మధ్యతరగతి ప్రజలైతే బంగారం విషయంలో మరింత ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీన్ని లెక్కగట్టే ప్రస్తుత ఎన్నికల్లో బంగారు తాళిబొట్లు ఫ్రీగా ఇస్తామంటూ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో సైతం ప్రకటిస్తుండటం గమనార్హం. సంపన్నుల పెళ్లిలో మరో కొత్త పోకడ కూడా ప్రారంభమైంది. వీరు బంగారం కన్నా ప్లాటినంకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. భవిష్యత్‌లో బంగారం కన్నా దీని ధర మరింత ప్రియం అయ్యి, గొప్ప పెట్టుబడి సాధనంగా ఉపయోగపడుతుందనేది వారి ఉద్దేశ్యం. బంగారం విలువ తెలుసు కనకే పలు టీవీ ఛానళ్లలో రకరకాల ప్రోగ్రాముల పేరుతో మహిళలను ఆకర్షించేందుకు 'మహిళలు మహరాణులు' అంటూ కిలోల కొద్ది బంగారాన్ని బహుమతులుగా ఇవ్వడం చూస్తూనే ఉన్నాం. పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్క మన రాష్ట్రంలోనే దాదాపు వెయ్యికోట్ల రూపాయలకు పైగా వ్యాపారం జరుగుతుండటం విశేషం. పెళ్లి ఖర్చుకన్నా బంగారం కొనుగోలుకే ఎక్కువ డబ్బు ఖర్చుచేయాల్సి వస్తోంది. వరుడి తరపువారు 'బంగారం మాకేం వద్దు. మీ అమ్మాయికేగా ఉండేది. ఇప్పుడు కాక మరింకెప్పుడు పెడతారు' అంటూ ముందరి కాళ్లకు బంధాలు వేస్తుండటం కూడా మనం చూస్తూనే ఉన్నాం.

ఎదురు బహుమతులు-సరికొత్త పోకడలు

గతంలో పెళ్లికి వచ్చిన అతిథులు వధూవరులను ఆశీర్వదిస్తూ బహుమతులు ఇవ్వడం సాంప్రదాయం. దీన్ని ఆదాయ పన్ను శాఖ కూడా గుర్తించి అలాంటి బహుమతులకు పన్ను రాయితీ కల్పిస్తుండటం గమనార్హం. ఇప్పుడు కాలం మారింది. సంప్రదాయం తిరగబడింది. పెళ్లికి వచ్చిన అతిథులకు వధూవరుల తరపువారే ఎదురు కానుకలు ఇస్తున్నారు. తమ పిల్లల పెళ్లి వేడుక కలకాలం గుర్తుండేలా ఖరీదైన బహుమతులను అతిథులకు ఇస్తున్నారు. పాతకాలంలో పెళ్లికి వచ్చిన ముత్తయిదవులకు బొట్టుపెట్టి స్థోమతను బట్టి జాకెట్‌ముక్కలు లేదా చీరలు పెట్టేవారు. అదికూడా సెలక్టెడ్ పర్సన్స్‌కే. ఇప్పుడు అలాంటిదేం లేదు. 'పెళ్లికి రండి! బహుమతి తీసుకెళ్లండి!!' అన్న రీతిలో వివాహాలు జరుగుతున్నాయి.

లాలూ ఇంట్లో పెళ్ళికి...

బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ తన కుమార్తె వివాహం అంగరంగ వైభవంగా జరిపించారు. పైకి సాదాసీదా మనిషిలా కన్పించే లాలూ కూతురి పెళ్ళి చూసి దేశమంతా విస్తుపోయింది. పెళ్ళికొచ్చిన అతిథుల్ని తీసుకురావడానికి, తీసుకెళ్ళడానికి 45 సరికొత్త కార్లు ఉపయోగించారు. అతిథులకోసం అశోకా హోటల్‌లో రూములు బుక్ చేసిన లాలూ దానికోసం పది లక్షలకు పైగా చెల్లించారు.

సహారా హవా...

సహారా గ్రూప్ ఛైర్మన్ సుబ్రతరాయ్ తన ఇద్దరు కొడుకుల పెళ్లిళ్లు వారం రోజులపాటు బ్రహ్మాండంగా జరిపించారు. ఈ పెళ్లికి అప్పటి ప్రధాని వాజ్‌పేయితోపాటు, అమితాబ్, షారూక్‌ఖాన్, ఐశ్వర్యారాయ్, సౌరభ్ గంగూలీ, సచిన్ టెండూల్కర్ వంటి ప్రముఖులు పదివేల మందికి పైగా హాజరయ్యారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ చిప్‌లు అమర్చిన ఆహ్వాన పత్రికల్ని రూపొందించారు. ఆ పత్రిక లేకపోతే పెళ్లి ప్రాంగణంలో అడుగుపెట్టడం కూడా సాధ్యం కాదు. ప్రముఖుల కోసం లక్నోలోని ఒక హోటల్‌లో 80 గదులు, సూట్‌లు కొన్ని వారాలపాటు బుక్ చేశారు. అతిథులను తీసుకురావడంకోసం 27 విమానాలను వాడారు. పలు విదేశీ వంటకాలను వండి వడ్డించారు. లండన్ నుంచి మ్యూజిక్ పార్టీని పిలిపించారు. బాలీవుడ్ తారలందరూ ఆ పెళ్లికి హాజరు కావడంతో ఆరోజు బాలీవుడ్‌కు అప్రకటిత సెలవుదినంలా అయింది.

సంపన్నులు దీన్ని కూడా 'స్టేటస్'గానే పరిగణిస్తూ అతిథులు అచ్చెరువొందేలా బహుమతులు అందజేస్తున్నారు. ఫలానా వారి పెళ్లిలో ఈ బహుమతి ఇచ్చారని అతిథులు నలుగురిలో గొప్పగా చెప్పుకోవాలనే తపన ఇక్కడ కన్పిస్తోంది. ఇదే సాంప్రదాయం పేద, మధ్య తరగతి వర్గాలకు కూడా పాకింది. అతిథులకు కనీసం స్టీలు ప్లేట్లయినా బహుమతిగా ఇవ్వక తప్పడం లేదు. మరికొందరు స్వీటు, హాటు ప్యాకెట్లు పెట్టి వధూవరుల పేర్లు ముద్రించిన చేతి సంచులను బహుమతులుగా ఇస్తున్నారు. ఈ పద్ధతి తమిళనాడు నుండి దిగుమతి చేసుకున్నదే. అక్కడ ఎలాంటి శుభకార్యాలు జరిగినా ఆ కార్యక్రమాల వివరాలు ముద్రించి చేతి సంచులు పంచడం ఆనవాయితీగా వస్తోంది. వెరైటీ కోరుకొనే వారు రకరకాల డిజైన్లతో అదే పద్ధతిని కొనసాగిస్తున్నారు. వెండి కుంకుమ భరిణలు, పంచలోహపాత్రలు, రాగి చెంబులు, స్టీలు చెంబులు, ప్లేట్లు ఇలా ఏదైతేనేం మొత్తానికి బహుమతి ఇచ్చామా లేదా అన్నదే ప్రధానంగా మారింది. చివరకు పెళ్లికి అతిథులు రావడమే మహాభాగ్యంగా భావించాల్సి వస్తోంది. వచ్చిన వారిని



ఒట్టి చేతులతో పంపలేక, గౌరవం కోసమైనా ఏదో ఒక బహుమతి చేతిలో పెట్టక తప్పడం లేదు.

మద్యం లేనిదే వేడుక లేదు

గతంలో పెళ్లికి వచ్చిన అతిథులు కాలక్షేపానికి పేకాట ఆడేవారు. ఇప్పుడు ఆస్థానాన్ని మద్యం ఆక్రమించింది. సంపన్నుల వివాహాల్లో ఇది కామన్. విదేశీ మద్యం బాటిళ్ల ఘాటైన వాసనలతో మత్తెక్కిస్తుంటే, డిజెల హోరులో ఒళ్లు మరిచి చిన్నాపెద్దా తేడా లేకుండా కేకలు, ఈలలతో కేరింతలు పెట్టడం ఫ్యాషనై కూర్చుంది. నవకాయ పిండివంటలతో కడుపారా భోజనం పెట్టినా, మద్యం లేని లోటు ఆ వేడుకలో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఓ 'చుక్క' పోస్తేనే ఆ వేడుక బ్రహ్మాండంగా జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఫలానా వారి పెళ్లిలో ఫలానా 'మందు' తాగామంటూ గొప్పగా చెప్పుకోవడం మనం తరచూ వింటూనే ఉన్నాం. ఇది కొత్త సాంప్రదాయం కాకపోయినా ఇటీవల 16 ఏళ్ల పిల్లల నుండి పండు ముదుసలుల వరకు విస్తరించి పోయింది. వయోభేదం లేకుండా అందరూ కలిసి ఒకేచోట తప్పతాగే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదంతా వేడుకలో భాగమేనని సరిపుచ్చుకోక తప్పడం లేదు. పేదలు గ్రామాల్లో వేడుకల్లో కల్లు తాగితే, మధ్య తరగతిలో వారిస్థాయి 'బ్రాండు బుడ్లు' ఖాళీఅవుతున్నాయి. ఏదేమైనా 'అతి సర్వత్రా వర్జయేత్'.

పెళ్లైతే...దీపావళే...

గతంలో సంవత్సరానికోసారి దీపావళి వచ్చేది. బాణాసంచా మోతలతో మార్మోగేది. ఇప్పుడు ప్రతి పెళ్లి ఇంట్లో దీపావళే. ఇటీవలి కాలంలో బాణాసంచా లేని పెళ్లి జరగట్లేదంటే అతిశయోక్తి కాదు. అప్పట్లో దేవుడి కళ్యాణాలు జరిగితే బాణాసంచా కాల్చేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. రకరకాల బాణాసంచా సంవత్సరం పొడవునా మార్కెట్లలో లభిస్తుంది. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకుంటున్నారు. కాకపోతే ఆర్థిక స్థోమతలను బట్టి వినియోగంలో తేడాలే తప్ప బాణాసంచా లేకుండా మాత్రం పెళ్లిళ్ల జరగట్లేదు. ఖర్చులో ఇదో అదనపు ఖర్చు. అట్టహాసం, ఆడంబరం, అదనపు ఆకర్షణ. సంపన్నులు ఆకాశాన్ని మిరుమిట్లు గొల్పుతుంటే, మధ్యతరగతివారిలో ఆ మోతాదు కాస్త తక్కువ. విశేషం ఏంటంటే ఈ బాణాసంచా కాల్చడానికి కూడా ఆయా కంపెనీలే ప్రత్యేకంగా మనుషుల్ని పంపిస్తున్నాయి. జీవితంలో జరిగే అతిపెద్ద వేడుక కాబట్టే దీని విషయంలో పెళ్లిపెద్దలు కాంప్రమైజ్ కావట్లేదు.

పెళ్లిళ్లు హుందాగా చేసుకోవడమే కాదు. సంసార సాగరంలో నూతన వధూవరులు కూడా అంతే హుందాగా వ్యవహరిస్తూ దాంపత్య జీవితాన్ని సుఖంగా గడపాలని ఆశిద్దాం...సంసారంలో భార్యాభర్తల మధ్య వచ్చే పొరపొచ్చాలపై చర్చలు జరగాలే తప్ప, వాదనలు కాదు. ప్రత్యర్థులు వాదించుకుంటారు. ఆత్మీయులు చర్చించుకుంటారు. ఇది గమనిస్తే ఇల్లేకదా...స్వర్గసీమ. మరి కొత్త దంపతులకు ఆల్ ది బెస్ట్ చెబుదామా....!!!

★

పాట్నా పోయి వద్దామా...

పాట్నా...భారతదేశ చరిత్రలోనే మకుటాయమానంగా శతాబ్దాలపాటు ప్రభవించిన మహానగరం. 25 శతాబ్దాలనాడు అజాతశత్రువు నిర్మించిన మగధ సామ్రాజ్యపు రాజధాని పాటలీపుత్ర. తరువాతి కాలంలో మహాపద్మనందుడు, నందవంశాన్ని మగధలో సుస్థిరం చేశాడు. దాదాపు ఉత్తర భారతమంతా మగధ సామ్రాజ్యమే. నందులనే నవనందులంటారు. క్రీపూ 343-322 కాలంలో రాజ్యపాలన చేశారు. వీరి కాలంలోనే అలెగ్జాండరు దండయాత్ర జరిగిందిగాని అతడు బియాస్ నదిని దాటి ముందుకు రాలేదు. అతడు తిరిగి పోవటానికి కారణం, అంతర్గత కారణాలతోపాటు మగధ సామ్రాజ్యపు శక్తిసంపత్తులు కూడా కారణమంటారు. అనంతర కాలంలో చాణుక్యుని సారథ్యంలో చంద్రగుప్తుడు నందులను కూలదోయటంతో మౌర్య వంశపాలన మొదలైంది.

ఈ వంశంలో బింబిసారుడు సామ్రాజ్యాన్ని మరింత విస్తరించి, అలెగ్జాండర్‌కు ప్రతినిధిగా పంజాబ్‌ను పాలిస్తున్న సెల్యూకస్‌ని ఓడించి అతడి కుమార్తెను వివాహమాడాడు. ఇంతటి సువిశాల భూభాగానికి, ఆనాటి పాలనా వ్యవస్థయొక్క నిర్మాణ చాతుర్యాన్ని గ్రీకులు సైతం కొనియాడారు. పెద్ద నగరాలన్నింటికీ స్వపరిపాలనా వ్యవస్థ వుండేది. ఒక్కో ప్రాంతానికి ఒక గవర్నరు. ఇలాంటి వికేంద్రీకరణతో ఇంత విస్తృతమైన రాజ్యవ్యవస్థ సాధ్యపడింది. ఈ వంశంలో మహోన్నతుడుగా వెలిగినవాడు అశోకుడు. ఈతడినే ప్రియదర్శిని అనికూడా వ్యవహరించేవారు. దేశమంతటా ఈతడి శాసనాలు ఈనాటికీ మనకు దర్శనమిస్తాయి. ఇక్కడో విషయం గమనించాలి. ఇంతటి సువిశాల రాజ్యమంతటా, అశోకుని శాసనాలు బ్రహ్మి లిపిలోనే వుంటాయి. దీనిని బట్టి ఆనాడు దేశమంతా ఒకే భాష వాడుకలో వుండేదని భావించవచ్చు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. ఊరికి బయటగా ఉత్తర దిశలోనున్న ప్రాంతాన్ని కుంహరార్ అంటారు. అంటే మౌర్యుల రాజప్రాసాదం ఉన్న చోటు. పురాతత్వ శాఖవారి అధీనంలో ఉంది. దీనికి పక్కనే వున్న పాతనగరాన్ని పాటలీపుత్ర అంటారు. దక్షిణ దిశగా కొత్త నగరం ఉంది.

కుంహరార్

ఇక్కడ తవ్వకాలు పెద్దగా జరిగిన జాడలేవీ లేవు. ఇక్కడ బయల్పడిన వాటిలో ముఖ్యమైనది మౌర్యుల దర్బారు హాలు. ఇది ఆనాడు 100 స్థంభాల మీద తీర్చిదిద్దిన సభామంటపం. ఒకనాటి తమ ఔన్నత్యాన్ని చాటుకుంటోంది. దీనికి పక్కనే అశోకుని శిలాధ్వజం. ఒకే రాతిలో మలచి అద్దంలాగా మెరుగు పెట్టారు. ఇది ముక్కలుగా విరిగిపడి వుంటే వాటిని భద్రపరిచారు. సామాన్యంగా అశోకుని స్థంభాల మీద మలచిఉండే మకుటం ఇక్కడ లభించలేదు. ఇక్కడికి తూర్పున కొంతదూరంలో బౌద్ధారామపు అవశేషాలున్నాయి. ఆనాటి పాటలీపుత్రము భారత దేశపు రాజకీయ చైతన్యానికి కేంద్రబిందువు. మగధ సామ్రాజ్యపు ప్రజల ధార్మిక జీవనానికీ సుఖశాంతులూ ప్రతీకగా నిలచి, మన చరిత్రలో స్వర్ణయుగంగా కీర్తించబడ్డది. ఇక్కడ పురాతత్వశాఖవారి సూచిక ఇలా వుంది. ఇక్కడ తవ్వకాలు పూర్తి స్థాయిలో జరిగితే చారిత్రక విశేషాలెన్ని బయటపడతాయో! కాని ఇప్పుడు బీహార్‌కు పాత చరిత్రతో పని లేదు. కొత్త చరిత్ర సృష్టిస్తోంది.

పాట్నా సిటీ

కుంహరార్ నుంచి కొత్త పట్టణంవైపు వెళితే, ఊరి మధ్యలో చాలా పెద్ద పార్కు ఉంది. దీనిని చాలా అందంగా తీర్చిదిద్దారు. చుట్టూ ఉన్న కాంక్రీటు

కట్టడాల మధ్య నిరంతరం వాహనాలు రేపే దుమ్ము అలజడి మధ్య పచ్చగా, అందంగా విశాలంగా పరచుకున్న ఇంతపెద్ద పార్కును చూచి మనస్సు సేదదీరుతుంది. దీన్ని గాంధీ మైదాన్ అంటారు. ముఖ్యమైన సభలన్నీ ఇక్కడే జరుగుతాయి. అన్ని నగరాల వలెనే కాంక్రీటు కట్టడాలు, 6 అంతస్థుల అపార్టుమెంట్లు కనిపిస్తాయి. ఇక్కడ సెక్రటేరియట్‌కు ఎదురుగా ఉన్న చౌరస్తాలో ఒక స్మారక చిహ్నముంది. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఆరుగురు విద్యార్థులు త్రివర్ణపతాకం పట్టుకుని ఆనాటి బ్రిటిష్ సెక్రటేరియట్ మీద ఆవిష్కరించటానికి ప్రయత్నించారుట. అందరూ బ్రిటిషు తుపాకులకు బలి అయినారు. వారి విగ్రహాలతో ఈ స్మారకచిహ్నం నిర్మించారు. ఏమైనది ఆనాటి దేశభక్తి! అంతకు సహస్రాబ్దుల ముందు నుంచీ భారతీయ సంస్కృతికి ఆలవాలమై విలసిల్లిన మగధ సామ్రాజ్యపు రాజధాని. బుద్ధుని అహింసా మార్గానికి పట్టం కట్టి ధార్మిక జీవనానికి ప్రాణం పోసిన కర్మభూమి. దారిద్ర్యం, అనారోగ్యం, నిరక్షరాశ్యత, నిరుద్యోగం కమ్ముకున్న ఈనాటి జనజీవనం మనస్సును ద్రవింపజేస్తుంది. ఇదేనేమో కాలమహిమ అంటే!



మ్యూజియం

ఇది తప్పక చూడవలసిన ప్రదర్శనశాల. మొఘల్ శిల్పరీతిలో అద్భుతమైన నగిషీలు చెక్కిన బ్రహ్మాండమైన కట్టడం. పాట్నా–గయ రోడ్డుమీద వుంది. చుట్టూ విశాలమైన పూదోట. ఎదురుగా మూడు ఆకారాలలో వున్న మూడు ఫిరంగులు అమర్చారు. వీటికి మధ్యయుగాల నాటి చారిత్రక ప్రాముఖ్యత వుంది. లోపల కుడిపక్కగా ఉన్న గేలరీలో ఒక విచిత్రం వుంది. ఒక మహావృక్షం పడుకోబెట్టి వుంది. ఇంత మహావృక్షం మొత్తం రాయిగా మారిపోయింది. 53 అడుగుల పొడవు, అంతలా వున్న కాండం మీద ఉన్న ముడుతలు, వంపులు ఏమీ చెక్కు చెదరలేదు. ఉన్నదున్నట్టుగా చెట్టు రాయిగా మారిపోయింది. దీని దగ్గర వివరణ ఈ విధంగా ఇచ్చారు. ప్రకృతిలో ఇంతటి రసాయనక చర్య జరిగేందుకు 2000 సంవత్సరాలు పడుతుందట.

ఇక్కడ శిల్పాలు ఎక్కువగా రాజగిరి, నలంద, గయ ప్రాంతాల్లో లంభించినవి. పాలరాయి, నల్లరాయి, ఇసుకరాతిలో మలచినవి. దాదాపు అన్నీ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకూ వెయ్యేళ్ళ కాలానికి చెందినవి. కొన్ని శిల్పాలలో భాసించే సౌందర్య సంపద మనల్ని మంత్రముగ్ధులను చేస్తుంది. వివిధ ముద్రలలో నున్న బుద్ధుడు, అవలోకితేశ్వరుడు, తారాదేవి శిల్పాలు ఆనాటి సౌందర్య పిపాస ఏ స్థాయిలో వుండేదో గోచరింపజేస్తాయి. సారన్ జిల్లా సిలోక్‌లో లభించిన విష్ణు విగ్రహం సౌందర్యం రూపుకట్టినట్లుంటుంది. దీనికి అలంకరించిన ఆభరణాలు సన్నటి తీగతో మలచినట్లు అతి సున్నితమైన శిల్ప చాతుర్యం గోచరిస్తుంది. ఒరిస్సాలోని కటక్‌లో లభించిన శిల్పాలను ఒక గదిలో అమర్చారు. 8, 9వ శతాబ్దాల నాటి ఈ శిల్పాలకున్న అలంకరణ చాలావరకూ అంతరించిపోయింది. అన్నీ బౌద్ధానికి చెందినవే. ఒక గేలరీలో మౌర్యుల కాలంనాటి (320-185 బి.సి) రథచక్రం వుంది. గట్టి చెక్కమీద అందమైన అలంకరణ అక్కడక్కడా విరిగినా, ఆకారం చెక్కు చెదరలేదు. ఎన్నెన్ని యుద్ధరంగాలలో విహరించిందో! ఆనాటి స్వర్ణయుగానికి సాక్షిగా నిలచివుంది. మేడమీద పెద్ద హాలులో మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ పాట్నాలో లాయరుగా ఉన్నప్పుడు ధరించిన దుస్తులు, వగైరా ఒకవైపున్నాయి. మరోవైపు వివిధ దేశాల పర్యటనలో బహూకరించిన జ్ఞాపికలున్నాయి. ఈ అంతస్థులో చూడవలసినవి కంచు విగ్రహాలు. అన్నీ బౌద్ధానికి చెందినవే. 9 నుంచి 11వ శతాబ్దికి చెందినవి. వీటిలో కొన్ని అద్భుతమైన కళాకండాలు. ఒకటి రెండిటి గురించి చెప్పుకుందాం.

తార

ఇది కుర్కిహార్ (గయ)లో దొరికిన 11వ శతాబ్దపు శిల్పం. కింది పీఠం నుంచి, చుట్టూ మలచిన తోరణం వరకూ అద్భుతమైన ఊహ, పనితనంలోని లాలిత్యం ముగ్ధుల్ని చేస్తాయి. శిల్పి యొక్క భావ సౌందర్యం శిల్పానికి ఆపాదించిన తీరు అనన్యం. చక్కని కళాఖండం. తారాదేవి విగ్రహం





హరిమందిర్

అవలోకితేశ్వరుడు

నల్లరాతితో మరొకటుంది. ఇదీ 11వ శతాబ్దిదే. పరిపూర్ణంగా వికసించిన స్త్రీ సౌందర్యం ఎలా వుంటుందో ఇక్కడ చూచితీరాలి. ఆనాటి సౌందర్య పిపాసకు మచ్చుతునక.

ఖదిరవాణి తార

కటక్‌లో దొరికిన ఈ 10 శతాబ్దపు శిల్పం ఎర్రరాతిలో అయిదడుగుల ఎత్తున మలచారు. పద్మపీఠం నుంచి, పైనున్న ఆర్చి వరకూ అద్భుతమైన కళారీతి. ఆ స్త్రీమూర్తి అవయవాల సోయగం కళ్ళు తిప్పుకోనివ్వదు. ముఖంలో ప్రసన్నతాభావం. నిశ్చలంగా కూర్చున్నట్లుంటుంది. మొత్తానికి ఇది చాలాపెద్ద మ్యూజియం. ఆనాటి జీవన విధానం, ఆధ్యాత్మికత ఎంతగా కలగలసివుండేవో, జీవనమాధుర్యాన్ని పుష్కలంగా పంచియిచ్చే వారి జీవనశైలి, ఇహమూ, పరమూ దేన్నీ విస్మరించక, వాటి సామరస్యాన్ని సాధించిన తీరు చూస్తుంటే ఏవో తీయని లోకాలలో విహరిస్తాము.

హరిమందిర్

ఇది పాతనగరంలో పోస్టాఫీసుకు ఎదురుగా వుంది. మూడంతస్థుల పాలరాతి భవనం. సిక్కుల గురు పరంపరలో 10వ గురువు గోవింద సింగ్ జన్మించిన పవిత్ర స్థానం. సిక్కులకు అతి పవిత్రమైన యాత్రాస్థలం. ఆ ఇంటిలో వారి తల్లిగారు నీరు తోడిన బావి ఇంకా అలాగే వుంది. దానిచుట్టూ పాలరాతి గోడకట్టి చిరస్మరణీయం చేశారు. మందిరం ప్రవేశింపగానే పెద్ద హాలులో పూజా మందిరం అలంకరించారు. ఈ పూజా మందిరం చుట్టూ బంగారు పూతవేసిన ఆర్చి వుంది. వచ్చిన భక్తుల కొరకు హాలులో తివాచీలు పరచారు. ఇద్దరు పూజారులు (వీరిని భాయిలంటారు.) గురుగ్రంథ సాహిబ్‌కు చామరాలు వీస్తుంటారు. కొంతమంది కృపాణాలు ధరించి జపం చేస్తుంటారు. తాను దర్శించిన ఆధ్యాత్మిక విలువల కొరకు తన సర్వస్వాన్నీ త్యాగం చేసిన ఆ మహాపురుషునకు మనసారా సమస్కరిస్తుంటారు పర్యాటకులు. ఇక్కడ పెట్టే గోధుమ రవ్వ హల్వా ప్రసాదం ఎంత రుచిగా వుంటుందనీ!

ఇక్కడి ప్రాశస్త్యం అవగాహనకు రావాలంటే గురుగోవింద సింగ్‌ను గూర్చి రెండు మాటలు చెప్పుకోవాలి. చిన్నతనంలో అల్లరికి మారుపేరైనా, క్రమంగా తరువాత సిక్కుల 10 వ గురువుగా ఆధ్యాత్మిక బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయానికి సిక్కులమీద హింస అధికమైపోయింది. వారనుభవించిన చిత్రహింసలు కొన్ని ఇక్కడ మొదటి అంతస్థులో వున్న సిక్కు మ్యూజియంలో చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఒక సిక్కుని నిలబెట్టి ఇద్దరు రంపంతో అతనిని కోస్తూంటే, మరోచోట ఒకరిని రెండు పండ్ల చక్రాల మధ్య త్రిప్పుతూ నుజ్జునుజ్జు చేస్తుంటారు. ఈ అమానుష కార్యాలన్నింటినీ, ప్రభుత్వ విధానం కింద, మున్నీ అనే అధికారి నిర్వహించాడట. ఈ హింసోన్మాదం రాను రాను పెరిగిపోయింది. ఈ అమానుష పీడనకు జవాబుగా గురుగోవిందసింగ్ సిక్కులను ఒక సైన్యంగా రూపుదిద్దాడు. ప్రతి సిక్కు మతస్థునికి సింగ్ (సింహము) అనే బిరుదు ప్రధానం చేశాడు. ఇలా అందరిపేరు చివరన సింగ్ అనే పదం వుంటుంది. ఈ పదవ గురువు పూర్వనామం గోవిందరాయ్. ఇది గోవిందసింగ్‌గా మారింది. వీరు శిరోజాలూ, గడ్డమూ కత్తిరించరాదు. తలకు టర్బన్‌తో ప్రత్యేక వేషధారణ విధించారు. వీరు ఎల్లవేళలా తమతో కృపాణం, దువ్వెన మొదలైన అయిదు వస్తువులనుంచుకోవాలి. వీరంతా కృపాణాలు పట్టి దీక్ష వహించాలి. ఇలా ప్రతి సిక్కు మతస్థునీ, ప్రాణాలివ్వటానికి సద్ధంగా ఉండే ఒక సైన్యంగా రూపుదిద్దాడు. తనను తన మత విశ్వాసాలను హింసిస్తున్న మొఘలుల మీద పోరాటం సాగించాడు. ఈ సుదీర్ఘ పోరాటంలో ఆయన కుమారులిద్దరూ మరణించారు. మిగిలిన ఇద్దరూ చిన్నపిల్లలు. వారిని పట్టుకుపోయి మతం మార్చుకోమని హింసలు పెట్టారు. ఆ చిన్నారుల తలవంచలేదు. వారిద్దరి తలలు తెగనరికారు. ఇక గోవిందసింగ్ భగవదా దేశంతో మరొక అపూర్వ నిర్ణయం చేశాడు. ఇకముందు సిక్కులకు ప్రత్యక్ష గురువుండడనీ, అంత వరకూ వారి గురువులు ప్రవచించిన మహావాక్యాలే గురువు యొక్క అవ్యక్తరూపంగా ఉంటాయనీ, కనుక ఆ గురుగ్రంథ సాహిబ్‌ని గురువుగా సేవించి, వారి బోధలనాచరించి తరించాలనీ మంగళశాసనం చేసి, అక్కడినుంచి నాందేడ్ వచ్చి, ఆత్మార్పణ చేశాడు. ఇలా సిక్కులను ఆధ్యాత్మికంగా, సాంఘికంగా అపూర్వమైన మలుపు తిప్పి తానే పదవ గురువు, చివరిగురువై వారి పూజల నందుకుంటున్నాడు.

తారాదేవి

ఇక్కడ పాతనగరంలో షేర్షా నిర్మించిన ఖిల్లా శిథిలాలు కనిపిస్తాయి. కాని చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. గంగానదీ తీరాన రెండున్నర సహస్రాబ్దుల పూర్వం నిర్మించిన ఈ నగర చరిత్ర ఎంతని చెప్పగలం. 18వ శతాబ్దం వరకూ దీనిని పాటలీపుత్ర అనే వ్యవహరించేవారు. కానీ ఔరంగజేబు మనవడు అజీమ్-ఉస్-షా దీని పేరును అజీమాబాద్‌గా మార్చాడు. కానీ అది ఎంతో కాలం నిలవలేదు. మెగస్తనీస్ వర్ణనను బట్టి పాటలీపుత్ర అవశేషాలు ప్రస్తుతపు కుంహరార్, భిక్నాపహరి, ఆగమ్‌కోమ్, బులండిబాగ్, కంకర్‌బాగ్ ప్రాంతాల్లో వుండి ఉండాలి. కుంహరార్ ప్రాంతంలో రాజప్రాసాదం ఉండి ఉండాలి. ★

క్రైమ్ కథ

- యర్నాగుల సుధాకరరావు

ఎవరు?

లోపల కొనూపిరితో పడున్నాడు సురేష్. పక్కనే పొడుగాటి గునపం రక్తసిక్తమైఉంది. ఇంట్లో బీరువా బార్లా తెరిచిఉంది. పెరటి తలుపులు చేరవేసి ఉన్నాయి. అంటే రేవతి భర్తను చావగొట్టి ఇలా పారిపోయి ఉంటుంది అనుకున్నారు.

ఉదయాన్నే పాలవాడు పాలప్యాకెట్ వేసి అదేపనిగా ఇంటితలుపు తడుతున్నాడు. ఎవరూ తెరవకపోవడంతో పక్కవాళ్లు ఆశ్చర్యపోయారు. రాత్రి సురేష్ భార్యను చావగొట్టాడు. కొంపదీసి చంపేశాడా? చంపేసి తాను పొడుచుకు చచ్చాడా?" అని ఒకామె నోరు వెళ్లబెట్టింది. అక్కడ క్షణాల్లో గుమిగూడారు. అదే వీధిలోంచి వేకువజామున వాకింగ్‌కు వెళ్లేవాళ్లకూడా అక్కడ ఆగి చెవులు రిక్కించారు. పోలీసులకు ఎవరో ఎదురు బూత్ నుంచి వేగు అందించేశారు. బిలబిలమని జీపులోంచి దిగారు. వెంటనే అక్కడ దర్యాప్తు ఆరంభిం చేశారు. పొరుగింట్లో ఆవిడ అడక్కుండానే వాగడం మొదలుపెట్టింది.

"అయ్యా సురేష్ ఒక కాంట్రాక్టర్. రాత్రయ్యేసరికి పూటుగా తాగేసి భార్య రేవతిని చావగొడుతుంటాడు. ఆమె ఎంతో మంచిది. కుళ్లపొడిచి ఏడు ఎముకలు విరిగేలా బండ తిట్లు తిడతాడు. ఎవరు చెప్పినా వినడు. రాత్రి పదకొండు గంటలప్పుడు చావగొట్టాడు, పాపం ఏడ్చింది. చెవులారా విన్నాం. ఆడికి ఏదో జబ్బువచ్చి ఛస్తాడనుకున్నాం. వాడు రేవతిని చంపేసి, వాడు పీక కోసుకుని చచ్చి ఉంటాడు" అని మొత్తం వివరించింది.

తలుపులు పగలకొట్టి లోపలకి వెళ్లారు పోలీసులు. లోపల దృశ్యం ఊహించుకుని అంతా భయం భయంగానే పోలీసుల వెంటనడిచారు అక్కడ గుమిగూడిన జనాలు.

లోపల కొనూపిరితో పడున్నాడు సురేష్. పక్కనే పొడుగాటి గునపం రక్తసిక్తమైఉంది. ఇంట్లో బీరువా బార్లా తెరిచిఉంది. పెరటి తలుపులు చేరవేసి ఉన్నాయి. అంటే రేవతి భర్తను చావగొట్టి ఇలా పారిపోయి ఉంటుంది అనుకున్నారు.ఆ ఆలోచనలను బలపరిచింది పొరుగింటావిడ. "రేవతి ఏదో మంచిది అనుకున్నాం. అమ్మో కట్టుకున్నోణ్ణి కుళ్లబొడిచి పారిపోయిందంటే అది ఆడది కాదు. వెతికివెతికిపట్టుకుని జైల్లో కుక్కండి. ఒకవేళ పాపం సురేష్ ఛస్తే ఆ రేవతిని ఉరేసేయండి" అని రెచ్చిపోయింది.

పోలీసులు వెంటనే సురేష్‌ను హాస్పిటల్‌లో చేర్చారు. విషయం తెలిసిన మరో కాంట్రాక్టర్ వచ్చి "అయ్యా రాత్రి ఇంటికి తీసుకువెళ్లి సురేష్‌కు ఆరులక్షలు ఇచ్చాను. నేనుండే లాడ్జిలో రక్షణ ఉండదని రేపటి చూస్తుండగానే ఇచ్చాను. ఉదయాన్నే తీసుకుంటానన్నాను. తీరా చూస్తే ఇలా జరిగింది. ఏంచేయను" అని నెత్తీనోరు బాదుకున్నాడు.

మరుసటిరోజు భర్తను గునపంతో పొడిచి ఆరులక్షలు నగదు, నగలతో పారిపోయిన భార్య రేవతి అని మీడియాలో పెద్దకథనాలు వెలువడ్డాయి. ఎక్కడ చూసినా ఆపట్టణంలో ఇదే టాపిక్ అయికూర్చుంది.

పోలీసులు సురేష్ బంధువులను పిలిపించారు. రెండువైపులవారు రేవతి గురించి చెడుగా చెప్పలేకపోయారు. పోలీసుల వెదుకులాట మొదలయ్యింది. రేవతి ఏమయ్యిందో తెలియలేదు. మూడురోజులు గడిచాయి. అప్పటికే మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. రేవతిపై అనేక రకాల కథలతో నింపేశాయి. పైగా సురేష్‌ను హీరోను చేసింది మీడియా. 'మా అమ్మాయి అలాంటిది కాదు' అని ఆమె తండ్రి ఎంతగా అరిచిగీట్టినా అతడిని ఎవరూ పట్టించుకోలేదు.

మరోవైపు సురేష్‌కు ఇంకా తెలివిరాలేదు. అతడు ప్రమాదంలోంచి బయటపడలేదు. గునపం డొక్కలో గుచ్చినందున తీవ్రరక్తస్రావం అయినందున అతడింకా మృత్యువు ఒడిలోనే సేదతీరుతున్నాడు. వారం తర్వాత పొరుగూళ్లో అనుమానాస్పదంగా ఒకడు నగలు అమ్ముతుంటే పోలీసులు పట్టుకుని జైల్లోకినెట్టారు. వాడిని నాలుగు తన్ని ఇంటరాగేట్ చేస్తే తాను ఎక్కడినుంచి దోచుకుని తెచ్చింది చెప్పాడు. దాంతో ఆపోలీసులు ఇక్కడ పోలీసులకు వేగు అందించి ఆదొంగను అప్పగించేశారు. ఇంతకీ ఆదొంగ చెప్పిన కథనం విని అటు పోలీసులు ఇటు మీడియా అవాక్కయ్యింది. ఇంతకీ కథేంటీ అంటే.....

రజ్జు (34) అనే దొంగ ఉదయమే సురేష్ ఇంటిని చూసి రాత్రికి దిగాలనుకున్నాడు. రాత్రి పదింటికి ఆఇంటి డాబామీదకు చేరుకుని ఒకమూల నక్కాడు. సురేష్ వచ్చాక ఏదో తిన్నాక, భార్యను అకారణంగా తిట్టడం మొదలుపెట్టాడు.ఆమె భయంతో నోరుమెదపలేదు. చేయిచేసుకున్నాడు. ఆదెబ్బలకు ఆమె పడిపోయింది. ఇదంతా డాబామీదనుంచి చూసిన రజ్జుకి మనస్సు విలవిలలాడిపోయింది. ఆమె నుదురు చిట్లింది. రక్తం కారడం వలన ఆమె తెలివితప్పిపోయింది. ఆమెను అలానే వదిలేసి సురేష్ బెడ్‌రూమ్‌లో పడుకున్నాడు. కొంతసేపటికి ఆమెకు తెలివివచ్చి మెల్లగా లేచి గాయానికి టించర్, కాటన్ పెట్టుకుని తన సూటుకేసులో బట్టలు సర్దుకుని నాలుగైదు వందలు మాత్రమే తీసుకుని పిల్లిలా మెల్లగా పెరటిద్వారం తెరుచుకుని పారిపోయింది. ఇదంతా మీదున్న గాజు వెంటిలేషన్‌లోంచి రజ్జు చూశాడు.

అప్పుడు రజ్జుకి తన దొంగతనం మరింత తేలికయినందుకు సంతోషం వేసింది. మెల్లగా బీరువా ఉన్నగదిలోకి వెళ్లాడు. "ఏయ్ నంగివేషాలు వేయకే. నిద్రపట్టి చావడంలేదు. వచ్చి పక్కలో తగలడు" అని సురేష్ అరిచాడు. అప్పుడు రజ్జు నేలమీద రక్తపు చుక్కలు చూశాక పక్కనేఉన్న గునపం అందుకుని సిద్ధంగా ఉన్నాడు. "ఏమేవ్! నిన్ను వచ్చి బతిమాలి లాలిస్తేగాని రావా! నీకు అంత సీన్ లేదు. వస్తావా రావా, నేను వస్తే ఎముకలు విరిచేస్తాను" అని సురేష్ అరిచి ఆ వెంటనే విసురుగా వచ్చాడు.

రజ్జు కోపంతో బిగుసుకుని చేతిలో ఉన్న గునపాన్ని చురచురమని వస్తున్న సురేష్ పొట్టలోకి దించేసి మళ్లీ అదే గునపంతో చాచి మెడమీద వేశాడు. కిక్కురుమనకుండా కుప్పకూలాడు. ఆతర్వాత బీరువాలో నగలు, నగదు మొత్తం ఒకచిన్నబ్యాగ్‌లో వేసుకుని అదే పెరటి ద్వారంలోంచి పారిపోయాడు. ఇది జరిగిన కథనం.

మీడియా రజ్జు బైట్స్‌తో వెల్లువెత్తింది. ఇంతవరకు రేవతిలో ఉన్నది మృగం అని అనుకుంటున్న జనాలు ఆమెస్థితికి జాలిపడ్డారు. సురేష్ లాంటి మంచివాడు మరిపుట్టడు అనే వాళ్లంతా అతడిని ప్రాసిక్యూట్ చేయాలి అని నినాదాలతో హాస్పిటల్‌లో హడావుడి చేశారు.

సురేష్‌కు తెలివొచ్చింది. పోలీసులు "నిన్ను ఎవరు గాయపరిచారు?" అని అడిగారు."నాభార్య రేవతిని మొదట్నించి అనుమానించాను. కానీ, నాఅనుమానం ఏనాడు రుజువుకాలేదు. అయితే నేను అర్ధరాత్రి లేచినపుడు ఆమెగదిలో ఒకడు నాపై గునపంతో దాడిచేశాడు. వాడు బలంగా ఉన్నాడు. వాడు పొడిచిన పోటుకు నేను తెలివితప్పాను. వాడిని చూస్తే గుర్తుపట్టగలను. వాడెవడనేది నాకు తెలీదు" వత్తిపలికాడు.

పోలీసులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.ఆతర్వాత సురేష్ పూర్తిగా కోలుకున్నాక, అసలు విషయం చెప్పారు. సురేష్ ఆశ్చర్యపోయాడు. రేవతి తన స్నేహితురాలు లాయర్ విజయతో వెనక్కివచ్చేసి "సురేష్‌తో జీవించడం ఎవరికీ సాధ్యంకాదు. అతడో అనుమానపు మృగం" అని పోలీసులకు రాతపూర్వ కంగా అందచేసింది.

★

ఆరోగ్యం

శుక్లం వస్తే...





డా॥ సాంబశివరావు,
ఆప్తాలజిస్ట్,
హైదరాబాద్.

మన రోజువారీ దినచర్య సజావుగా చేసుకోవడానికి మనకు సరైన కంటిచూపు ఎంతో అవసరం. బయటి ప్రపంచాన్ని చూసేందుకు, చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు కళ్లు సాయం చేస్తాయి. అవే గనుక లేకుంటే, మనం ఏం చేస్తున్నామో, ఎక్కడికి వెళ్తున్నామో తెలియదు.....ఒక్క ముక్కలో చెప్పాలంటే జీవించడం ఎంతో కష్టమౌతుంది. నేత్ర సంబధవ్యాధులు సోకిన వారిలో చాలామంది ఓ నిర్దిష్ట వయస్సు దాటిన తరువాత కాటరాక్ట్ (శు క్లం) వచ్చిన వారే అయి వుంటారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ, కళ్లు బలహీనం కావడం వల్ల నేత్ర సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం అధికంగా వుంటుంది. ఈ సమయంలో మనకు రాగల నేత్ర వ్యాధులు, వాటిని నిరోధించే, తగ్గించుకునే విధానాల గురించిన ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం ఎంతో అవసరం.

కంటిని బాగా ప్రభావితం చేసే వ్యాధులలో ముఖ్యమైనది కాటరాక్ట్. ఒక్క భారతదేశంలోనే 70 లక్షల మందికి పైగా కాటరాక్ట్‌తో బాధపడుతున్నారు. కనీస వసతులు, పరిశుభ్రత బాగా తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఈ వ్యాధికి అధికంగా గురవుతుంటారు. ఈ నేపథ్యంలో కాటరాక్ట్ గురించి తెలుసుకుని, తగు నిరోధక చర్యలు తీసుకోవడం వారికి మరింత ముఖ్యావసరంగా మారింది.

కాటరాక్ట్ అంటే...?

కాటరాక్ట్ అంటే, కంటిలోని కటకం మకసబారిపోయి, దృష్టికి సంబంధించిన సమస్యలు ఏర్పడడం. కంటిలోని కటకం చాలా వరకు నీళ్లు, ప్రొటీన్లతో కూడుకుని ఉంటుంది. కాంతి తనగుండా ప్రసారమౌతూ రెటీనా మీద పడేలా ప్రొటీన్ అమరి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కొంత ప్రొటీన్ ముద్దగా ఒక చోటుకు చేరుతుంది. ఇలా కావడం మొదలుకాగానే కటకంపై కొన్ని చిన్న చిన్న భాగాలు మసకబారటం మొదలవుతుంది. రెటీనాను చేరకుండా కాంతిని అడ్డుకోవడం జరుగుతుంది. చూపులో తేడా వస్తుంది. అదే కాటరాక్ట్.

ప్రారంభ దశల్లో, కాటరాక్ట్ అసలు ఓ సమస్యగానే అన్పించదు. కాలం గడుస్తున్న కొద్దీ, కాటరాక్ట్ పెద్దదవుతూ వస్తుంది. కటకంపై మరింత భాగాన్ని కమ్మేస్తుంది. చూడడం కష్టంగా మారుతుంది. చాలా తక్కువ కాంతి మాత్రమే రెటీనాను చేరటం వల్ల, చూపు మబ్బుగా, మసగ్గా ఉంటుంది. ఒక కంటి నుంచి మరో కంటికి కాటరాక్ట్ వ్యాప్తి చెందనప్పటికీ, చాలామందిలో రెండు కళ్లలోనూ కాటరాక్ట్ వృద్ధి చెందుతుంది.

శుక్లం కావడానికి కారణం?

వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటిలోని కటకం మబ్బుబారటం సహజం. 65 ఏళ్లు దాటిన వారిలో క్రమంగా కంటిచూపు తగ్గుతూ వస్తుంది. మధుమేహం, గ్లూకోమా వంటి ఇతర వ్యాధుల కారణంగా తలెత్తే సమస్యల వల్ల లేదా స్టెరాయిడ్స్ ఇన్‌ఫెక్షన్, వారసత్వ పరమైన వ్యాధుల చికిత్సల దుష్ప్రభావాల వల్ల కూడా కాటరాక్ట్ వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలేంటి?

కాటరాక్ట్‌కు సంబంధించిన సాధారణ లక్షణాలు...

* మబ్బుగా, మసగ్గా కన్పించడం.
* కాంతితో సమస్యలు తలెత్తడం, రాత్రివేళల్లో హెడ్‌లైట్లు మరీ ప్రకాశవంతంగా అన్పించడం, దీపాలు మసగ్గా కన్పించడం, సూర్యకాంతి మరీ ప్రకాశవంతంగా అన్పించడం, కాంతి చుట్టూరా వలయాలుగా కన్పించడం లాంటి సమస్యలు తలెత్తడం.
* రంగులు వెలిసిపోయినట్టుగా కన్పించడం
* రాత్రివేళల్లో చూపు మందగించడం
* ఒక్క వస్తువే రెండుగా, అంతకు మించిన సంఖ్యలో కన్పించడం (కాటరాక్ట్ వృద్ధి చెందుతున్న కొద్దీ ఈ లక్షణం కూడా పెరుగుతూ ఉంటుంది).
* కంటి అద్దాల్లో లేదా కాంటాక్ట్ లెన్స్‌లలో తరచూ మార్పులు రావడం.

ప్రారంభ దశలో కాటరాక్ట్ చిన్నదిగా, అసలు దృష్టిలో ఎలాంటి మార్పులు గమనించలేని విధంగా ఉంటుంది. కాటరాక్ట్‌లు క్రమంగా పెరిగి పెద్దవౌతూ ఉంటాయి. అవి పెద్దవవుతున్న కొద్దీ క్రమంగా దృష్టి బాగా తగ్గిపోతుంటుంది.

గుర్తించటమెలా?

సాధారణంగా నేత్రవైద్య నిపుణులు కాటరాక్ట్‌ను గుర్తించేందుకు కంటిలోని కటకాన్ని పరీక్షిస్తారు. సమగ్ర నేత్ర పరీక్షలో దిగువ పేర్కొన్న పరీక్షలన్నీ ఉంటాయి.

విజువల్ దయలేషన్

ఐ డ్రాప్ వేయడం ద్వారా కనుపాపను పెద్దదిగా చేసి కటకాన్ని, రెటీనాను మరింతగా పరీక్షిస్తారు. నేత్ర సంబంధ ఇతర సమస్యలేవైనా ఉంటే తెలుసుకుంటారు.

టోనోమెట్రీ

కంటిలో ఫ్లూయిడ్ ప్రెషర్ ఎంతగా ఉందో తెలుకునేందుకు నిర్వహించే

ప్రామాణిక పరీక్ష ఇది. ప్రెషర్ గనుక పెరిగినట్లయితే, అది గ్లూకోమాకు సూచన కాగలదు.

చికిత్స

కాటరాక్ట్ ప్రారంభ దశలో ఉంటే కంటి అద్దాలు, మాగ్నిఫైయింగ్ లెన్సెస్ లేదా స్ట్రాంగర్ లైటింగ్ ద్వారా కంటి చూపును మెరుగుపర్చవచ్చు. వీటివల్ల ఫలితం లేకపోతే, సర్జరీ మాత్రమే ఇక సరైన చికిత్స. ఇందులో మసకబారిన కటకాలను తొలగించి, ప్రత్యామ్నాయ కటకాలను అమరుస్తారు.



చూపు తగ్గడం వల్ల బండి నడపడం, చదవటం, టీవీ చూడడం లాంటి దైనందిన కార్యకలాపాలకు ఇబ్బంది కలిగినప్పుడు మాత్రమే కాటరాక్ట్‌ను తొలగించాల్సి ఉంటుంది. రెండు కళ్లకూ కాటరాక్ట్ గనుక వుంటే, రెండింటిలోనూ శుక్లాలను ఒకేసారి తొలగించరు. ఒక్కోదాన్ని విడివిడిగా తొలగించాల్సి ఉంటుంది. ఒక్కోసారి చూపుకెలాంటి సమస్యలు కలిగించనప్పటికీ, కాటరాక్ట్‌ను తొలగించాల్సి వస్తుంది.

ఎలా తొలగిస్తారు?

కాటరాక్ట్‌ను తొలగించేందుకు ప్రాథమికంగా రెండు మార్గాలున్నాయి.

ఫాకోముసిఫికేషన్ లేదా ఫాకో

కంటి ముందు భాగాన్ని కాపాడుతూ ఉండే డోమ్ (గుమ్మటం) ఆకారంలోని ఉపరితల భాగంలో కార్నియా (కనుగుడ్డు ముందు భాగం) పక్కన చిన్న కోత చేస్తారు. ఓ చిన్నపాటి ఉపకరణాన్ని దాని ద్వారా లోనికి జొప్పిస్తారు. ఇది అల్ట్రాసౌండ్ తరంగాలను విడుదల చేస్తుంది. ఆ తరంగాలు కటకంలో మబ్బు పట్టినట్లుగా ఉండే భాగాలను మృదువుగా చేసి విచ్ఛిన్నం చేస్తాయి. నేడు చాలా వరకు కాటరాక్ట్ ఆపరేషన్లు ఇదే విధానంలో జరుగుతున్నాయి.

ఎక్స్‌ట్రా క్యాప్సులర్ సర్జరీ

కార్నియా పక్కన కాస్తంత పెద్ద రంధ్రం చేయడం ద్వారా కటకం యొక్క గట్టిపడిన కేంద్రభాగాన్ని తొలగిస్తారు. మిగిలిన భాగాలను పీల్చే ఉపకరణాల ద్వారా తీసివేస్తారు.

అత్యధిక కాటరాక్ట్ సర్జరీల్లో తొలగించిన లెన్స్‌కు బదులుగా ఇంట్రాక్యులర్ లెన్స్ (ఐఒఎల్) ఉపయోగిస్తున్నారు. ఐఒఎల్ అనేది ఓ కృత్రిమ కటకం. ఒకసారి దాన్ని అమర్చిన తరువాత దాని గురించి ఎలాంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకోనవసరం లేదు. శరీరంలో ఓ భాగంగా మారిపోతుంది. ఐఒఎల్ అమర్చుకున్న తరువాత ఆ వ్యక్తి మరింత మెరుగ్గా, స్పష్టంగా చూడగలుగుతారు. కారణం, కాంతిని అది తన గుండా రెటీనాకు అందించగలుగుతుంది. తమకు కొత్త కటకం అమర్చారన్న భావన లేదా అనుభూతి రోగులకు కలగదు.

చూపు మామూలుగా ఎప్పుడవుతుంది?

ఆపరేషన్ అనంతరం చాలా త్వరగానే చాలామంది తమ రోజువారీ కార్యకలాపాలను నెరవేర్చుకోగలుగుతారు. అయితే చూపు కాస్తంత మబ్బుగా ఉంటుంది. ముఖ్యంగా, మరో కంటికి కాటరాక్ట్ ఉన్నప్పుడు సర్దుకోడానికి కొంత సమయం పడుతుంది.

ఆపరేషన్‌తో ఫలితం ఉంటుందా?

నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అత్యంత సాధారణ ఆపరేషన్లలో కాటరాక్ట్ తొలగింపు కూడా ఒకటి. అంతే కాకుండా, అత్యంత సురక్షితమైన, ప్రభావపూరితమైన (ఫలితాన్ని ఇవ్వగల) ఆపరేషన్ కూడా. ఆపరేషన్ అనంతరం 90 శాతానికి పైగా రోగులు మెరుగైన చూపును పొందగలుగుతున్నారు.

★









కొత్త పుస్తకాలు

ఛిద్రమవుతున్న జీవితాల శకలాలు

చేదుఫలం
జీవన్ కథలు
ప్రతిభ ప్రచురణలు, ఖమ్మం
వెల: 50/-,
పేజీలు: 166,
ప్రతులకు: అన్ని ప్రముఖ కేంద్రాలు.

విస్తారమైన జీవితాన్ని అద్దంలో చూపెడ్తున్నట్లన్పించే కథల్ని రాయడంలో కొందరు సిద్ధహస్తులన్పిస్తుంది. కొన్ని కథల్ని చదువుతున్నప్పుడు ఆ కథల్లోని పాత్రలు, సన్నివేశాలు మనల్ని గత స్మృతుల్లోకి నెట్టివేస్తాయి. చూసీ చూడనట్లుగా వ్యవహరించిన మన మనస్తత్వాన్ని పిండుతాయి. బహుశా ఈ కథలు మన చుట్టూ వున్న జీవితాల్లోకి తొంగి చూడటం వల్లనేమో కలవరపెడ్తాయి. అన్ని కథలూ ఇలా వుండవు. ఉండాలని కోరుకోవడమూ లేదు. ఐతే ఒక రచయిత రాసిన కథలన్నీ ఇలాగే ఉంటే...?! ఊహకందని 'కల' నిజమైనట్లుంటుంది. అచ్చంగా జీవన్ "చేదుఫలం" కథలు చదివినప్పుడు ఇదే అభిప్రాయం కల్గింది నాలో! సప్త సముద్రాల్ని నింపుకున్న కన్నీళ్ళు ఈ పుస్తకంలో ఉన్నాయి. నిజ జీవితాన్ని, ఇంకా చెప్పాలంటే ఎవరి జీవితాన్ని వారికి అద్దంలో చూపాయి కథలు. కొన్ని కథలు ముఖ్యంగా 'నీట మునిగిన బతుకు బతుకమ్మ', 'ఈ పాపం ఎవరిది?' కథల్లో నేటి వర్తమాన జీవితం విప్పి చెప్పడంలో ఒక నూతనావిష్కరణ దిశగా రచయిత అడుగేశాడు. 'బతుకమ్మ కథ' చాలా చిన్న కథ. ఏ పూట కాపూట నాల్గు మెతుకుల్ని కూడేసుకునే 'మాదిగ' గూడెంలోని ఓ నిరుపేద కుటుంబ 'ఆకలి'ని అక్షరంగా మల్చడంలో జీవన్ కృతకృత్యులయ్యారు. ఏడో తరగతి చదువుతున్న నీలమ్మ గొంతుతో మొదలెట్టి చివరి కంటా నడిపించాడు. బతుకమ్మ పండగనాడు ఊరి చెరువులోని పువ్వులు కోసుకొచ్చి అమ్మి పైసల్ తీసుకొస్తనన్న నాయన. కుండపోత వానలో... ఒంటరిగా కాక మాల ఎంకన్న ఆటోలో తిరిగొచ్చినప్పుడు "మీన కలువ పువ్వులు కొప్పిన్రు. మా అమ్మ, నాయనమ్మా గుండెలు బాదుకుంట ఏడుస్తున్రు" అని అతను చనిపోయిన విషయాన్ని పాఠకునికి ధ్వని పూర్వకంగా చెప్తాడు. కథ చివర్లో ప్రాణం లేని నాయన "నువ్వు పంతులమ్మవు కావాల్నె బిడ్డ– అంటున్నట్టె వున్నడు" ఏడ్పు రాలే నాకు – అయాల్ల సంది ఇయ్యాల్ల దనుక కండ్లు మూసినా తెరిసినా మా నాయనే నా కండ్లల్ల మెదుల్తుండు" అని చెప్పడంతో రచయిత ఏడేండ్ల పసిపిల్ల హృదయాన్ని కళ్ల ముందుంచుతారు.

పేదల జీవితాల్లో కష్టాలకు, కన్నీళ్ళకు అంతం చావుతోనే. ఇవే దీనిలో చాలా కథల సారాంశంగా కన్పిస్తుంది. ఐతే కొన్ని కథల్లో చైతన్యం చెందని బడుగులు మార్పుకోసం తమ జీవితాల్లో మార్పులను తీసుకురాలేక పోతున్నాయన్న స్పృహ కొన్ని కథల్లోని పాత్రలకు ఉంటుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో రాసిన కథల్లో దాని వికృత రూపాన్ని ఇంకా చెప్పాలంటే నిజ స్వరూపాన్ని చూపిన కథలూ ఈ సంకలనంలో ఉన్నాయి. నేటి ఎలక్ట్రానిక్ మీడియా 'పోటీ' పేరుతో చేస్తున్న (సృష్టిస్తున్న) అనవసరపు, హేయమైన, విచిత్ర చేష్టలపై "మా....యా... జాలం" కథ వాడియైన వ్యంగ్యాస్త్రం. జీవితాల్లో వస్తున్న అసంతృప్తులకు సమాధానంగా చెప్తున్న 'డబ్బు సంపాదన' లోని పోటీతత్వాన్ని ప్రశ్నించిన కథ "ఇంకెంత దూరం" ఈ కథలో ఎల్కేజీ బాలుడు భుజాలపై బండెడు బరువు మోపిన విద్యా వ్యవస్థపై తల్లి చెయ్యి పట్టుకొని నడుస్తున్న పసివాడు నడవలేక 'ఇంకెంత దూరం'? అన్న ప్రశ్న వేస్తాడు. ఈ ప్రశ్న జవాబులేని అనాథ కావడం విషాదమే. ఏమైనా పోటీ పేరుతోనో, విలాసం పేరుతోనో జీవితాల్ని ఎవరికి వారికి అగాధంలోకి పెట్టుకోవడాన్నే 'గ్లోబలైజేషన్" అనొచ్చన్న అంతిమ తీర్పునిచ్చిన ఈ కథల్నిండా జీవద్భాష తొణికిసలాడింది. కథనం కథకు పరిపూర్ణత నిస్తుందంటారు. జీవన్ ఈ విషయాన్ని నిరూపించారన్పిస్తుంది. కొన్ని కథల్లోని పాత్రలు ప్రశ్నించే చైతన్య స్థాయికి చేరుకోలేక పోయినా కథనం వల్ల గొప్ప కథల స్థాయికి ఎదిగాయి. చైతన్యం తీసుకురాని ఏ కథా నిలబడలేదన్న విషయం సీనియర్ కథకుడుగా జీవన్‌కు తెలియనిది కాదు. తెలంగాణా పల్లె భాషను పాత్రానుగుణ్యంగా వాడుకొని నేటివిటీని కల్గి వున్న కథల్ని అందించిన జీవన్ అభినందనీయులు.

- సైదులు ఐనాల



భావం
పువ్వుల నరసింహం
వెల : 200/-,
పేజీలు :191,
ప్రతులకు :
దిశ బుక్ సెంటర్, చిక్కడపల్లి.
నవయుగ బుక్ హౌస్,
సుల్తాన్ బజార్.
నవోదయా బుక్ హౌస్, కాచిగూడ.
విశాలాంధ్ర బుక్ హౌస్,
సహచర బుక్ మార్క్
ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.

రాగం
పువ్వుల నరసింహం
వెల : 100/-,
పేజీలు :83,
ప్రతులకు :
దిశ బుక్ సెంటర్, చిక్కడపల్లి.
నవయుగ బుక్ హౌస్,
సుల్తాన్ బజార్.
నవోదయా బుక్ హౌస్, కాచిగూడ.
విశాలాంధ్ర బుక్ హౌస్,
సహచర బుక్ మార్క్
ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.



కేకు గౌను

నచ్చిన నిచ్చెలికి కానుక ఇవ్వడానికి పుత్తడి ఆభరణాలే అవసరం లేదని తాజాగా ఓ నలభీముడు రుజువుచేశాడండోయ్! చూశారుగా...ఈ జంటని. ప్రేమ మైకంలో మునిగితేలుతున్నట్టులేదు!! అతగాడికేమో బేకరీలో కేకులు తయారు చేసే పని. మది దోచిన పిల్లను పెళ్లాడబోతున్నాడు. కానుకగా ఏం ఇస్తాడని మీరు అనుకుంటున్నారు? ఊహించలేరుకదూ. ఏకంగా కేకులతో గౌను కుట్టించేశాడు. ఇదిగో ఆ అమ్మడి వంటిమీద వయ్యారంగా ఇమిడిపోయిన గౌను అదే. ఇందుకుగాను 1500 క్రీమ్ పఫ్‌లను ఉపయోగించాడతను. వాటేన్ ఐడియా! అనిపిస్తోందా?

హృదయం ఎక్కడ వున్నదీ...

"హృదయం ఎక్కడ వున్నదీ...హృదయం ఎక్కడ వున్నదీ...నీచుట్టూనే తిరుగుతున్నదీ..." అన్న పాట వినపడగానే... ఎక్కడికో వెళ్లిపోయేవారు ఎందరో! హృదయ భాషకు...మనసు గోసకు బానిసలు కానిది ఎవరు చెప్పండి! ప్రేమకు వున్న పవర్ అలాంటిది మరి. అది క్లాస్ అయినా మాస్ అయినా... చివరికి మూగజీవాలైనా సరే! ఇదిగో ఈ బుజ్జాయిని, కుక్క పిల్లను చూశారుగా. ఇటీవల జపాన్‌లో జన్మించిన ఈ దూడ అమ్మానాన్నల ప్రేమ చిహ్నాన్ని నుదుటిన పెట్టుకుని మరీ పుట్టేసింది. ఈ హృదయాకారాన్ని చూసి దూడ యజమానే కాదండోయ్! ఆ గ్రామంలోని వారంతా తెగ మురిసిపోతున్నారు!!

కురూపి పిల్లి



ప్రపంచంలోని పిల్లుల్లోకెల్లా అత్యంత కురూపి పిల్లి ఏదయా? అంటే ఇదే. దాన్ని చూసి తరించాలంటే మాత్రం అమెరికా వెళ్లాల్సిందే. న్యూ హేంప్‌షైర్‌లోని ఓ పశువుల ఆసుపత్రిలో ఎంచక్కా ముడుచుకొని పడుకొని వుంటుందిది. ఆసుపత్రి ఉద్యోగులు దీన్ని అక్కడినుంచి పంపించాలని ఎంతగా ప్రయత్నించినా ఊ...హూ...! ఓపట్టాన కదలదు కాక కదలదు కదా! కానీ పాపం రూపు అందవిహీనంగా వున్నా చాలా మంచి మార్జాలం. దీన్ని చూడ్డానికి జనాలు తెగ ఎగబడుతున్నారు. సెల్‌ఫోన్లు, కెమెరాల్లో దాన్ని బంధించి మరీ తీసుకెళుతున్నారు. అయితే దీనికి ఓ సోదరి కూడా వుండేది. అది కూడా దీనిలానే వెంట్రుకలు లేకుండానే పుట్టింది. కాకపోతే కొద్దిరోజులకే చనిపోయింది.

నందయ్య బావి

- పుప్పాల కృష్ణమూర్తి

ఇందుప్రియ నగరాన్ని జయంతుడు పాలిస్తున్న కాలం. అప్పుడు ఆ రాజ్యంలో నందగిరి అనే గ్రామం ఉంది. ఆ ఊరిలో ఒక్క మంచి నీళ్ల బావి కూడా లేదు. రెండు కోసుల దూరాన ఉన్న ఉదయగిరి వెళ్లి నీళ్లు తెచ్చుకునేవారు. ఉదయగిరి ప్రజలపట్ల, నందగిరి గ్రామ ప్రజలు ఎంతో వినయంగా మసలుకునేవారు. అంతేగాక అప్పుడప్పుడు వాళ్లను సంతోషపెట్టాడానికి కానుకలు కూడా ఇస్తుండేవాళ్లు. ఒకసారి నందగిరి మహిళ ఒకరు ఉదయగిరి గ్రామంలో నీళ్లు చేదుతుండగా, చేంతాడు తెగి, బకెట్ బావిలో పడ్డది. దానిపై కోపించిన ఉదయగిరి పెద్దలు పంచాయతి పెట్టి 'రేపట్నుంచి మీగ్రామ ప్రజలు మా గ్రామానికి, నీళ్లకు రావడానికి వీల్లేదు' అని తీర్మానం చేశారు. నందగిరి గ్రామ ప్రజలంతా కూర్చుని 'ఎంతకాలమిలా వాళ్లకు అణిగి మణిగి ఉండాలి? మనం రాజుగారిని కలిసి నీళ్ల సమస్య గురించి చెబుదాం. ఈ ఊళ్లో కూడా బావి తవ్వించమని అడుగుదాం" అని మాట్లాడుకున్నారు.

"బాగానే ఉంది. కాని రాజు అసలే ముక్కోపి. ఆయనకు మన సమస్యను విన్నవించే ధైర్యం ఎవరికుంది? ఆయన ఆగ్రహానికి గురికాకుండా, మెడకాయమీద తలకాయతో తిరిగి వచ్చేదెవరు?" అన్నాడు ఒక పెద్ద మనిషి.

సమస్య అర్థమయ్యేట్లు సాత్వికంగా చెప్పగలవాడు నందయ్య మాత్రమే. అతణ్ణి పంపితేనే సమస్య పరిష్కారమవుతుంది. అని అంతా ఒకే మాటకొచ్చి, నందయ్యను బ్రతిమాలుకున్నారు. నందయ్య అరవై ఐదు సంవత్సరాల రైతు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తనదైన నేర్పుతో పరిష్కారం చెబుతుండేవాడు. ప్రజల మేలు కోసం సదా ప్రయత్నిస్తుండేవాడు.

నందయ్య అంగీకరించి, "రాజుతో మన సమస్య గురించి మనవి చేస్తా. రాజు కోపంతో నన్ను చంపేసినా, నావల్ల బాధపడేవాళ్లెవరూ లేరు. నేను ఎక్కువ కాలం బ్రతకను. నేను మరణించేలోపు, మన గ్రామ సమస్య పరిష్కారమైతే అంతకన్నా నాకు కావలసిందేమీ లేదు" అని చెప్పాడు.

గ్రామస్తులంతా ఇంటికి రెండు రొట్టెల చొప్పున చేసి, మూటకట్టి నందయ్య నెత్తిన పెట్టారు. రాజు వద్దకు బయలుదేరుతూ నాలుగు కొబ్బరి కాయలు మూట కట్టుకుని చేత బట్టుకున్నాడు. గ్రామస్తులిచ్చిన రొట్టెలతో ఆకలి తీర్చుకుంటూ, నెల రోజులపాటు నడిచి, ఎట్టకేలకు ఒకరోజు మధ్యాహ్నం రాజసభకు చేరుకున్నాడు. ఎండ మండి పోతోంది. భటుణ్ణి బ్రతిమాలుకుని సభలోకి ప్రవేశించాడు.

రాజుకు వినయంగా నమస్కరించి "అయ్యా! మాది నందగిరి గ్రామం. నేనో పేద రైతును. కొబ్బరి పంట వేయడంతో కాపుకొచ్చింది. మీరంటే నాకు వల్లమాలిన ప్రేమ. అందుకే మీకు కానుకగా ఇద్దామని మొదటి కాపు కొబ్బరికాయలు తెచ్చాను" అని తన కండువ చివరన కట్టి ఉన్న మూటను విప్పాడు. రాజు సంతోషంతో "సమయానికి తెచ్చావు. దాహం తీర్చుకుంటా" అన్నాడు.

"ధర్మ ప్రభువులు. తమరే పగలగొట్టి తాగండి" అని కొబ్బరి కాయలు అందించాడు. ఒక కొబ్బరి కాయను తీసుకొని నేలమీద కొట్టాడు. ఫట్టుమని మధ్యకు పగిలి పోయింది. కాని ఒక్క చుక్క నీరు కూడా కనిపించలేదు. అవమానం అనిపించగా, మరోటి తీసుకుని కొట్టి చూశాడు. ఆశ్చర్యం! దాంట్లో కూడా నీళ్లు లేవు. కోపంతో వెంట, వెంటనే మరో రెండు కొట్టాడు. వాటిలో కూడా చుక్క నీరు లేదు.

దిగ్గున లేచి నిలబడి, "నీళ్లు లేని కాయలు తెచ్చి మమ్మల్నే అవమానిస్తావా? నా ఖడ్గంతో నీ శిరస్సునిప్పడే ఖండిస్తా" అన్నాడు కత్తి మీద చెయ్యి వేసి.

"మహరాజులు మన్నించాలి. మా గ్రామంలో ఒక్క బావి కూడా లేదు" అన్నాడు అతి వినయంగా. కాస్త శాంతించి, "అలాగా? మీ గ్రామంలో బావి లేకుంటే వెంటనే తవ్విస్తా. ఉంటే, నీళ్లు లేని కొబ్బరికాయలు ఇచ్చినందుకు చచ్చేదాకా ఇక్కడే ఉండు" అని భటులను పంపాడు.

భటులు పరుగున వెళ్ళి, నందగిరి గ్రామమంతా తిరిగి, ఒక్క బావి కూడా లేదని నిర్ధారించుకుని వచ్చారు. అంతేగాక గ్రామస్థుల సమస్యను ఎత్తి చూపిన పద్ధతికి మెచ్చుకున్నాడు. పిదప సగౌరవంగా గుర్రం మీద ఇంటికి పంపించాడు.

మరుసటి రోజు రాజాజ్ఞ మీద పనివాళ్లు నందగిరి వెళ్లి నాలుగు చోట్ల బావులు తవ్వారు. ఒక చోట చక్కని మంచినీళ్లు పడ్డాయి. జనం కష్టాలు తీరాయి. ప్రజలంతా రాజుకు, రాజ సభకు వెళ్లి వచ్చిన నందయ్యకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. రాజు తవ్వించినా, జనమంతా ఆ బావిని ఇప్పటికీ నందయ్య బావనే అంటుంటారు.



శ్రీకాకుళం